
ఆరు గేట్ల ద్వారా దిగువకు వెళుతున్న నీరు

శ్రీశైలానికి భారీగా వరద నీరు

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే : ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద కొనసాగుతోంది. జూరాల, సుంకేసుల జలాశయాలు, హంద్రీనది నుంచి 1,95,929 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి శ్రీశైలం జలాశయం నీటిమట్టం 884.80 అడుగులు, నీటి నిల్వ 214.8450 టీఎంసీలుగా నమోదైంది. శ్రీశైలం జలాశయం ఆరు గేట్లను పది అడుగుల మేర పైకెత్తి స్పిల్‌వే ద్వారా 1,67,898 క్యూసెక్కులు, కుడి, ఎడమగట్టు జల విద్యుత్తు కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ 66,013 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.

కొత్తపల్లిలో 18.8 మి.మీ. వర్షం

నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే : జిల్లాలో శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు పలు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. అత్యధికంగా కొత్తపల్లిలో 18.8 మిల్లీమీటర్లు, జూపాడుబంగ్లా 11.2, చాగలమర్రి 10.6, పాములపాడు 9.8, ఆత్మకూరు 9.2, వెలుగోడు 6.4, శ్రీశైలం, నందికొట్కూరు 4.2, ఉయ్యాలవాడ 3.8, గడివేముల 3.2, శిరివెళ్ల 2.6, మిడుతూరు 2.4, రుద్రవరం 2.0, ఆళ్లగడ్డ మండలంలో 1.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

టెట్‌కు 195 మంది గైర్హాజరు

పాణ్యం గ్రామీణం, నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లాలోని మూడు పరీక్ష కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు 195 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో2 సుబ్రహ్మణ్యం తెలిపారు. పాణ్యం మండలంలోని ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం 280 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 227 మంది, మధ్యాహ్నం 280 మందికిగాను 252 మంది పరీక్ష రాశారని చెప్పారు. శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో 200కు 175, మధ్యాహ్నం 199కు 172, నంద్యాల సమీపంలోని ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం 175కు 145, మధ్యాహ్నం 174కు 142 మంది హాజరైనట్లు వివరించారు. ఎలాంటి ఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

కాల్వల్లో పూడిక..
పురాల మునక

- పట్టణాలను వెంటాడుతున్న ముంపు భయం
- నిధులున్నా ఖర్చు చేయని వైనం


చినుకు పడితే చాలు.. పట్టణాలు విలవిల్లాడుతున్నాయి. వీధులన్నీ జలమయమవుతున్నాయి. కాలువల్లో పూడిక పేరుకుపోయి మురుగు ముందుకు కదలని పరిస్థితి. దీనికి తోడు వర్షం నీరు చేరుతుండటంతో రహదారులను మురుగు ముంచెత్తుతోంది. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తున్నా పూడిక తీత పనులపై దృష్టి సారించడం లేదు.

– న్యూస్‌టుడే, ఆదోని పురపాలకం, నంద్యాల పురపాలకం, డోన్ పట్టణం, నందికొట్కూరు, బేతంచెర్ల

○ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. కాలువల్లో పూడికతీత పనులకు నిధులు కేటాయించింది. ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగరపాలక సంస్థ మినహా ఎనిమిది పురపాలిక, నగర పంచాయతీలకు రూ.422.095 లక్షలు కేటాయించింది. మూడు నెలలు గడుస్తున్నా నిధులు పూర్తిస్థాయిలో ఖర్చు చేయలేదు.

సకాలంలో పూర్తిచేయక..

పురపాలికల్లో సొంత నిధులతో పనులు చేయలేక.. అటు ఇచ్చిన నిధులను ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోలేక అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఫలితంగా ఏటా వర్షాకాలంలో పట్టణ ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. రహదారులపై మోకాలి లోతు నీరు నిలుస్తోంది. ప్రజలకు ఆస్తి నష్టంతోపాటు రోగాలు చుట్టుముడుతున్నాయి. ఉన్న నిధులతో సకాలంలో పనులు పూర్తి చేస్తే సమస్యలు ఉండేవి కావు. తీరా ముంపు సమస్యలు ఎదురయ్యాక సహాయక చర్యల పేరుతో హడావుడి చేస్తున్నారు.



నంద్యాల ప్రధాన రహదారిపై వర్షం నీటి ప్రవాహం

చినుకు పడితే..

○ నందికొట్కూరు పురపాలక సంఘానికి రూ.35.06 లక్షలు విడుదల చేశారు. ఇందులో మొదటగా రూ.12.53 లక్షలతో పనులు చేపట్టాలని ప్రణాళికలు సిద్ధం చేయగా రూ.1.76 లక్షలు మాత్రమే ఖర్చు చేశారు. మారుతీనగర్, హాజీనగర్, సాయిబాబాపేట, హౌసింగ్ బోర్డు కాలనీ, బైరెడ్డి శేషశయనారెడ్డి నగర్, విద్యానగర్ కాలనీలకు ముంపు సమస్య తప్పడం లేదు.

○ డోన్‌కు రూ.40 లక్షలు కేటాయించగా రూ.32 లక్షలు వెనక్కు వెళ్లాయి. మిగిలిన రూ.8 లక్షలతో 6 కి.మీ. మేర ప్రధాన వంకలో పూడికతీత పనులు చేపట్టారు. ప్రధాన వంకల్లో మాత్రమే పనులు చేశారు. 115.10 కి.మీ. ఉన్న చిన్న కాలువలను వదిలేశారు. నేటికీ శ్రీరామనగర్, తారకరామనగర్, ఆర్టీసీ కాలనీ, సుజాతనగర్, తదితర కాలనీ వాసులు వర్షం పడితే ముంపు భయంతో వణికిపోతున్నారు.

○ నంద్యాల పురపాలికకు రూ.1.49 కోట్లు విడుదలయ్యాయి. మూడు ప్రాంతాల్లో రూ.15 లక్షల చొప్పున రూ.45 లక్షలతో పనులు చేపట్టారు. 6 కి.మీ. పొడవునా చామ కాలువ ఉంది. 300 కి.మీ. వరకు మురుగు కాలువలున్నాయి. చేసిన పనులు అరకొరగానే ఉన్నాయన్న విమర్శలున్నాయి. కాలువలు అస్తవ్యస్తంగా ఉండటం.. ప్రధాన వంకలో పూడిక పేరుకుపోవడంతో బైటిపేట, సంజీవనగర్ గేట్, శ్రీనివాసనగర్, సలీంనగర్ తదితర ప్రాంతాలకు ముంపు ముప్పు తప్పడం లేదు.

○ ఆళ్లగడ్డకు రూ.30.66 లక్షలు మంజూరయ్యాయి. ఇందులో రూ.16 లక్షలతో పనులు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. పట్టణ వ్యాప్తంగా 60 కి.మీ. మేర కాలువలు, 4 కి.మీ. వంక ఉంది. వంకలో పూడికతీత పనులు చేపట్టలేదు. సద్దాం కాలనీ, రామలక్ష్మి కొట్టాల, బుడగజంగాల కాలనీ, శ్మశాన వీధి ప్రాంత వాసులను వరద భయం వెంటాడుతోంది. ఆత్మకూరు పట్టణానికి నిధులిచ్చి వెనక్కు తీసుకోవడంతో పనులు చేపట్టలేకపోయారు.


ఆలయం వెనుక భాగాన..

జల సవ్వడులు


భైరవగుండం వద్ద జలపాతం

ఎగువ అహోబిలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో జలపాతాలు జాలువారుతున్నాయి. గత కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో పెద్దఎత్తున నీరు వస్తోంది. ఎగువ అహోబిలంలో భైరవ గుండం, ఆలయ వెనుక భాగం, జ్వాలా ఆలయం వద్ద ఎత్తైన కొండల నుంచి నీటిధారలు ప్రకృతి ప్రియులను అలరిస్తున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి జలపాతాలను చూసి ఆనందంలో మునిగిపోతున్నారు.

– న్యూస్‌టుడే, అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం)

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక


నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. స్థానిక సెంటినరి హాల్‌లో ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని ఆదివారం ఆమె వెల్లడించారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయిల్లోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ఒత్తిళ్లు తీవ్రం.. రోగాలతో సతమతం

వారందరూ పోలీసు ఉద్యోగం సాధించేందుకు నెలల తరబడి నిరంతరం సాధన చేశారు. దేహదారుఢ్యం పెంపొందించుకున్నారు. కేవలం 25 నిమిషాల్లో ఐదు కిలో మీటర్లు పరుగెత్తి ఉద్యోగం సాధించుకున్నారు. కొలువు చేపట్టి విధుల్లో నిమగ్నమయ్యారు. ఆ తర్వాత వ్యాయామం చేయడమే మరిచిపోయారు. చివరికి నడవడమే కష్టంగా మారింది. ఒకవైపు పెరిగిన పనిభారం.. మానసిక ఒత్తిడి.. మరోవైపు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. రోజురోజుకు ఆస్పత్రులకు వెళ్లే వారి సంఖ్య ఎక్కువవుతోంది.

భర్తీ ఎప్పుడో..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 86 పోలీసుస్టేషన్లు ఉన్నాయి. వీటి పరిధిలో పోలీసు అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వెయ్యి మంది హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారు. పలు స్టేషన్లలో సిబ్బంది కొరత వేధిస్తుండటంతో పోలీసు అధికారులు, సిబ్బందిపై పనిభారం పెరిగిపోయింది. ఫలితంగా శారీరకంగా.. మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన పోలీసు నియామకాల ప్రక్రియ పూర్తి కాలేదు. మరోవైపు కొత్త జిల్లాలను ఏర్పాటుచేసి సిబ్బందిని విభజించారు. ఫలితంగా మానవ వనరుల కొరత బాగా పెరిగిపోయింది.



–న్యూస్‌టుడే, నంద్యాల నేరవిభాగం

కనీస సౌకర్యాలు కరవు

ఉమ్మడి జిల్లా పరిధిలో పలు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరోవైపు ఉన్న వారు నిత్యం విధుల్లో ఉండాల్సి రావడం.. వారాంతపు సెలవు లేకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. తీవ్ర ఒత్తిడికి గురై రోగాలబారిన పడుతున్నారు. దీనికితోడు బందోబస్తు విధులు పెరిగిపోయాయి. తిరుపతి, విజయవాడ, విశాఖపట్టణం వంటి సుదూర ప్రాంతాల్లోనూ బందోబస్తు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. వెళ్లిన చోట కనీస సౌకర్యాలు ఉండటం లేదు. ఫలితంగా బందోబస్తు విధులంటే హడలిపోయే పరిస్థితి నెలకొంది.

వ్యాయామం దూరం


ఒత్తిళ్లు.. అదనపు విధులు తదితర కారణాలతో చాలా మంది మంది వ్యాయామం చేయడం లేదు. కనీసం నడక, యోగా, ధ్యానం వంటి వాటికి సమయం కేటాయించలేకపోతున్నారు. మరికొందరు చేజేతులారా అనారోగ్యాన్ని 'కొని' తెచ్చుకుంటున్నారు. చాలా మంది ఊబకాయంతో బాధపడుతున్నారు. 30 శాతానికిపైగా ఉద్యోగులు చక్కెర, రక్తపోటుతోపాటు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. 45 ఏళ్ల వయస్సు పైబడివారు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. గడిచిన ఏడాది కాలంలో కర్నూలు జిల్లాలో 10 మంది చనిపోగా వారిలో 8 మంది అనారోగ్యంతోనే ప్రాణాలు కోల్పోవడం గమనార్హం.

ఆరోగ్య భద్రత ఏదీ..

పోలీసు ఉద్యోగులు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందేందుకు ఆరోగ్య భద్రత పథకం ఉంది. వీరు మన రాష్ట్రంతోపాటు తెలంగాణ రాష్ట్రంలోని ఆసుపత్రుల్లోనూ చికిత్స చేయించుకునేవారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కర్నూలు జిల్లాలో 14, నంద్యాల జిల్లాలో 2 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో మాత్రమే చికిత్స పొందేందుకు పరిమితం చేసింది. మరోవైపు నెట్‌వర్క్ ఆస్పత్రులకు బిల్లులు సక్రమంగా చెల్లించకపోవటంతో సదరు వైద్యాలయాల నిర్వాహకులు వివిధ కారణాలు చెప్పి చికిత్స చేయకుండా కాలయాపన చేస్తున్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంటు విధానం పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది.

నిర్వహణ కష్టం తీరింది

- ఎట్టకేలకు పాఠశాలలకు పైసలు
- రెండేళ్లుగా నిధులు లేక హెచ్ఎంల విలవిల



ప్రభుత్వ పాఠశాలలకు గత రెండేళ్లుగా నిర్వహణ నిధులు విడుదల కాకపోవడంతో ప్రధానోపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సొంత డబ్బు ఖర్చు చేసి పాఠశాలలను నిర్వహించాల్సిన పరిస్థితి. అప్పటి ప్రభుత్వానికి నివేదించినా పట్టించుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రధానోపాధ్యాయులు సమస్యను విన్నవించారు. దీనికి ప్రభుత్వం స్పందించింది. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు రూ.100 కోట్లు విడుదల చేస్తున్నట్లు మంత్రి ప్రకటించడంతో ఉపాధ్యాయుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

ఉమ్మడి జిల్లాలో విద్యాలయాల వివరాలు

జిల్లా	ప్రాథమిక	ప్రాథమికోన్నత	ఉన్నత
కర్నూలు	1202	508	532
నంద్యాల	1127	351	477

రూ.10 కోట్లకుపైగా బకాయిలు

కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 2023-24 విద్యా సంవత్సరానికి సుమారు రూ.8.07 కోట్లు, 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి రూ.2.15 కోట్ల వరకు గత వైకాపా ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. ఫలితంగా హెచ్ఎంలే తమ జేబు నుంచి ఖర్చు చేశారు. ప్రస్తుతం ఈ బకాయి నిధుల విషయంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాన్ని ప్రకటించాల్సి ఉంది.

సుద్దముక్కకూ డబ్బుల్లేక..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,329 ప్రాథమిక, 859 ప్రాథమికోన్నత, 1,009 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఏడాదికి 20 మంది విద్యార్థుల్లోపు ఉన్న పాఠశాలలకు రూ.10 వేలు, 100 మంది లోపు ఉన్న బడులకు రూ.20 వేలు, 100 మందిపైగా విద్యార్థులు ఉన్న విద్యాలయాలకు రూ.50 వేలు నిర్వహణ నిధులు ఇవ్వాలి. గత వైకాపా ప్రభుత్వం కరోనా తర్వాత పాఠశాలలకు సంబంధించిన కాంపోజిట్ గ్రాంట్లు, మండల రిసోర్స్ కేంద్రాల నిర్వహణ నిధులు విడుదల చేయలేదు. 2022-23 విద్యా సంవత్సరానికి ఉమ్మడి జిల్లాలోని పాఠశాలలకు 25 శాతం నిధులు మాత్రమే ఇచ్చింది. 2023-24 విద్యా సంవత్సరానికి ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. ఫలితంగా ప్రధానోపాధ్యాయులే సొంత డబ్బులు ఖర్చు చేశారు. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలతోపాటు రాష్ట్ర, జాతీయ పండగలు, ఇతర కార్యక్రమాల నిర్వహణకు నిధులు లేక ఇబ్బందులు పడ్డారు. సుద్ద ముక్కలకు సైతం నిధులు ఇవ్వకపోవడంతో పాఠశాలల నిర్వహణ భారంగా మారింది. చివరికి చాలామంది హెచ్ఎంలు అప్పులు చేసి మరీ పాఠశాలల నిర్వహణ చేపట్టారు.

క్రీడల అభివృద్ధికి ప్రాధాన్యం

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : నంద్యాలలో 68వ రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య అండర్-17 బాల బాలికల ఫెన్సింగ్ పోటీలు ఆదివారం స్థానిక పద్మావతినగర్‌ని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథులుగా హాజరైన డీఈవో సుధాకర్‌రెడ్డి, తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెదేపా ప్రభుత్వ హయాంలో క్రీడలను చాలా అభివృద్ధి చేశామన్నారు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు నంద్యాల వేదిక కావడం హర్షణీయమన్నారు. 13 జిల్లాల నుంచి క్రీడాకారులు నంద్యాలకు రావడం సంతోషకరమన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనాథ్ మాట్లాడుతూ.. పోటీల్లో 350 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. మూడు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి గిడ్డయ్య, ఆయా మండలాల ఎంఈవోలు, పీడీలు పిచ్చిరెడ్డి, నాగేంద్ర, నాగరాజు పాల్గొన్నారు.


పోటీలు ప్రారంభిస్తున్న డీఈవో సుధాకర్‌రెడ్డి, ఎన్ఎండీ ఫిరోజ్

పవిత్రోత్సవం.. పరమపావనం

అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: పాడి పంటలతో, మానవాళి సుఖసంతోషాలతో ఉండాలని, ఆలయంలో సంవత్సరంలో జరిగిన పూజల్లో తప్పులు, దోషాల నివారణకు అహోబిలంలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నారు. నాలుగు రోజుల నుంచి ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను అర్చకులు శాస్త్రోక్తంగా పూజిస్తున్నారు. దిగువ అహోబిలంలోని వెంకటేశ్వరస్వామి సన్నిధిలో స్వామి, అమ్మవార్లను కొలువుంచి హోమగుండాల్లో హోమం నిర్వహించారు. ధూపదీపాలతో మహామంగళహారతి అందించారు. సాయంత్రం విశేషంగా అలంకరించి పల్లకిపై స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చి తిరువీధి ఉత్సవం జరిపారు. రాత్రి యాగశాలలో ప్రాయశ్చిత్త హోమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సోమవారం రాత్రి మహాపూర్ణాహుతితో ఉత్సవాలు ముగియనున్నాయి.


స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

ఆనందం.. అంతలోనే విషాదం 6లో

AP-DSC SA/SGT
జి.కె & కరెంట్ అఫైర్స్ - వేముల సైదులు సార్ & P.I.E - రావుల శేఖర్‌రెడ్డి సార్ గార్లచే
అక్టోబర్ 22 నుండి కొత్త బ్యాచ్ ప్రారంభం
పరిమిత సీట్లు... ప్రత్యేక శ్రద్ధ కలదు
హాస్టల్ వసతి కలదు
Timings: 9 AM to 6 PM
★ డైలీ టెస్టులు ★ వీక్లీ గ్రాండ్ టెస్ట్
విజేత స్టడీ సర్కిల్
Sai Vasanth Complex, Birla Compound, KURNOOL. Cell: 94400 47227.

చివరికి నష్టమే!

- కన్నీరు మిగిల్చిన వర్షం
- వేలాది ఎకరాల్లో నేలవాలిన పంట

సకాలంలో వర్షాలు కురవడంతో జలాశయాలకు పుష్కలంగా నీరు చేరింది. చెరువులు, కాలువలు, వాగులు, వంకలు నీటితో కళకళలాడుతున్నాయి. అన్నదాతలు ఆనందంలో మునిగిపోయారు. చాలామంది రైతులు వరి సాగుపై దృష్టి సారించారు. గతేడాది 1,27,995 ఎకరాల్లో సాగు చేయగా ప్రస్తుతం 1.50 లక్షలకుపైగా సాగు విస్తీర్ణం పెరిగింది.

– న్యూస్‌టుడే, పాణ్యం, పాణ్యం గ్రామీణం

అల్పపీడనం ముంచింది..

మరో నెల రోజుల్లో పంట చేతికి వస్తుందని రైతులు సంబరపడ్డారు. వరి ధాన్యం ధరలు సైతం ఆశాజనకంగా ఉండటంతో తమ కష్టాలు తీరాయని ఆశపడ్డారు. అంతలోనే అల్పపీడనం రూపంలో కురిసిన వర్షం రైతుల కష్టాన్ని నేలపాలు చేసింది. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో చాలా ప్రాంతాల్లో వరి దెబ్బతింది. పైరు నేలవాలడంతో రైతులు తీవ్ర వేదనలో మునిగిపోయారు. దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడులపై ప్రభావం

ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో వరి పొట్ట దశ, ఎన్ను దశలో ఉంది. ఈ క్రమంలో వర్షాలు పడటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వరి కంకులకు పాలు పట్టే దశలో పైరు నేల వాలడంతో గింజ పట్టదని.. ఫలితంగా దిగుబడులు తగ్గుతాయని పేర్కొంటున్నారు. పంటను కాపాడుకునేందుకు అన్నదాతలు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అదనంగా ఎకరాకు మరో రూ.10 వేలకుపైగా ఖర్చు చేయాల్సి వస్తోందని చెబుతున్నారు.


మహానంది మండలం తమడపల్లెలో నేలవాలిన వరి

1.56 లక్షల ఎకరాలకు పైగా సాగు

నంద్యాల జిల్లా పరిధిలో కర్నూలు సోనా (బీపీటీ 5204), నంద్యాల సోనా (ఎన్‌డీఎల్ఆర్ 7) తదితర రకాలు ఎక్కువగా సాగు చేస్తున్నారు. నంద్యాల జిల్లాలో 70,069 మందికి పైగా రైతులు 1,56,339 ఎకరాల్లో వరి సాగు చేశారు. జిల్లాలో అత్యధికంగా బండి ఆత్మకూరు మండలంలో 24,914, శిరివెళ్ల 13,919, రుద్రవరం 13,769, అవుకు 11,305, నంద్యాల 10,542, గోస్పాడు 10,415, పాణ్యం 9,531, బనగానపల్లి 8,449, మహానంది 8,104, వెలుగోడు 7,504, ఆళ్లగడ్డ 6,668, ఆత్మకూరులో 5,544 ఎకరాల్లో వరి సాగైంది.

రెండెకరాల్లో పడిపోయింది

– శాంతప్ప, రైతు, కొండజూటూరు



నేను ఆరెకరాల్లో వరి సాగు చేశా. మరో మూడు వారాల్లో చేతికి అందాల్సిన పంట వర్షాలకు నేల వాలింది. రెండెకరాలకుపైగా పంట పడిపోవడంతో ఏమి చేయాలో అర్థం కావడం లేదు. అలానే వదిలేయలేక కూలీలను పెట్టి కట్టలు కట్టించేందుకు అదనంగా ఎకరాకు రూ.10 వేల వరకు ఖర్చవుతోంది. పంట బాగుందనుకున్న సమయంలో మూడు రోజుల్లోనే వర్షాలతో దెబ్బతింది. బాధిత రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వం ఆదుకోవాలి

– మల్లయ్య, కొండజూటూరు



మొదట్లో సకాలంలో వర్షాలు పడటంతో పదెకరాల్లో వరి సాగు చేశా. దోమ, ఇతర తెగుళ్ల నుంచి పంటను కాపాడుకుంటూ వస్తున్నా. కంకి దశకు చేరుకున్న సమయంలో ఇటీవల కురిసిన వర్షాలు దెబ్బతీశాయి. మరో మూడు వారాల్లో కోతకు వస్తుందనగా వరిపైరు పడిపోయింది. రెండెకరాల్లో పంట నేల వాలడంతో కూలీలను పెట్టి కట్టలు కట్టిస్తున్నాం. వరి ఎన్నులు నీటిలో పడటంతో గింజ నాణ్యత తగ్గుతుంది. ప్రభుత్వం స్పందించి ఆదుకోకుంటే తీవ్రంగా నష్టపోతాం.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి


ప్రకటనల కొరకు 99899 97628

అక్కాచెల్లెళ్లు.. అల్లికల్లో విజేతలు



గిన్నిస్ వరల్డ్ రికార్డు పత్రం అందుకుంటున్న నిహారిక

☛ గిన్నిస్ రికార్డుల్లో చోటు సాధించిన కవిత, నిహారిక

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : చాలామంది విద్యార్థులు చరవాణులు, టీవీలు చూస్తూ సమయాన్ని వృథా చేస్తున్నారు. కొందరు విద్యార్థులు మాత్రం ఖాళీ సమయంలో ఇష్టమైన క్రీడలు.. కళలు.. చేతివృత్తులు నేర్చుకుంటూ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్నారు. నంద్యాలకు చెందిన అక్కాచెల్లెళ్లు కవిత, నిహారిక ఇదే కోవలో అల్లికల్లో శిక్షణ తీసుకుని తిరుగులేని ప్రతిభ చూపుతున్నారు. పోటీల్లో సత్తాచాటి ఏకంగా గిన్నిస్ రికార్డుల్లో చోటు సాధించి ప్రశంసలు అందుకుంటున్నారు.

నంద్యాల పట్టణం ఎన్జీవో కాలనీకి చెందిన శ్రీనివాసులు, లక్ష్మీదేవి దంపతుల కుమార్తెలు కవిత, నిహారిక. కవిత 10, నిహారిక 8వ తరగతి చదువుతున్నారు. అల్లికలపై ఆసక్తితో సెలవుల్లో శిక్షణ పొందారు. యూట్యూబ్ వీడియోలు చూస్తూ, పత్రికల్లో వచ్చే కథనాలు చదువుతూ ఊలన్ దారంతో గృహ అలంకరణ వస్తువులు తయారు చేయడంపై దృష్టి పెట్టారు. అక్కాచెల్లెళ్లు పోటీపడి అల్లుతూ నైపుణ్యాలు మెరుగుపరుచుకున్నారు. చదువుల్లో సైతం ప్రథమ స్థానాల్లో నిలుస్తున్నారు.

మూడు నెలల్లో 450 వస్తువులు

విశాఖపట్నానికి చెందిన మహిళా మనోవికాస్ క్రాఫ్ట్ అండ్ క్రియేషన్స్ సంస్థ మూడు నెలల కిందట అల్లికలపై పోటీలు ప్రకటించింది. అందులో పాల్గొనే వారు ఉలన్‌తో మూడు నెలల్లో 450 రకాల వస్తువులు తయారు చేయాలి. అల్లికలను మొత్తం సెల్ఫీ వీడియోలు తీసి వారానికి ఒకసారి పంపాలి. ఒక వారం ఉపయోగించిన రంగులను మరోవారం వాడకుండా అలంకరణ వస్తువులు తయారు చేయాలి. ఈ నిబంధనలను అనుసరిస్తూ అక్కాచెల్లెళ్లు మూడు నెలల్లో ఒక్కొక్కరు 450 వస్తువులు తయారు చేశారు. ఈ ఏడాది సెప్టెంబరు 22న విశాఖపట్నంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో మహిళా మనోవికాస్ క్రాఫ్ట్ అండ్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో అతి పెద్ద ప్రదర్శన నిర్వహించారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న ఈ ప్రదర్శనలో కవిత, నిహారికలు తాము రూపొందించిన వస్తువులను ప్రదర్శించారు. గిన్నిస్ రికార్డు సంస్థ నుంచి జ్ఞాపిక, ప్రశంసా పత్రాలు అందుకున్నారు.



తాను అల్లిన వస్తువులతో కవిత

వసతి గృహం.. అసౌకర్యాల నిలయం



కొసిగి సమీకృత బాలుర వసతి గృహం గదుల్లో విరిగిన పంకాలు



గదుల్లో చిందరవందరగా పెట్టెలు, సామగ్రి



వసతి గృహ ముఖద్వారం వద్ద అపరిశుభ్రత

మంత్రాలయం నియోజకవర్గం కోసిగి మండల కేంద్రంలోని సమీకృత బాలుర వసతి గృహం అపరిశుభ్రతకు నిలయంగా మారింది. అక్షరాస్యతలో రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతం కోసిగి. ఇక్కడ ఎప్పుడూ కరవు, కాటకాలతో వలసలు అధికంగా ఉంటాయి. ఇక్కడి విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా ఉండాలని 500 మందికి సరిపడా బాలుర సమీకృత వసతి గృహాన్ని నిర్మించారు. కానీ ప్రస్తుతం 250 మంది విద్యార్థులు మాత్రమే ఉంటున్నారు. వసతి గృహ భవనం రెండు అంతస్తులు ఉండగా, మొదటి అంతస్తులో మాత్రమే వసతి గృహాన్ని నిర్వహిస్తున్నారు. రెండో అంతస్తును నిరుపయోగంగా ఉంచారు. వసతి గృహం చుట్టూ మురుగు నిల్వ ఉండి ముళ్ల పొదలు, గదుల్లో విరిగిన పంకాలు, ధ్వంసమైన విద్యుత్తు సామగ్రి, గదుల్లో చెల్లాచెదురుగా పెట్టెలు, పగిలిన కిటికీ అద్దాలు దర్శనమిస్తున్నాయి. వసతి గృహ విద్యార్థులు భోజనం చేస్తున్న గదిలోనూ కిటికీల నుంచి దుర్వాసన వస్తోంది. చుట్టూ మలమూత్ర విసర్జన, పందుల సంచారం, చెత్తా చెదారంతో అపరిశుభ్రత పోటెత్తుతోంది. – న్యూస్‌టుడే, కౌతాళం

హామీలు నెరవేర్చాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న సమస్యలపై కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్టీయూ కార్యవర్గ సమావేశాన్ని ఎమ్మిగనూరులోని కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను నిర్లక్ష్యం చేసిందని, కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు అవుతున్నా ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు.

నిశ్చితార్థ వేడుకల్లో జిల్లా మంత్రులు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ కుమార్తె నిశ్చితార్థ వేడుకల్లో రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు. గోవాలో ఆదివారం నిర్వహించిన ఈ వేడుకల్లో వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిర తదితరులు పాల్గొన్నారు.



కాబోయే వధూవరులతో టీజీ భరత్, ఫరూక్, బీసీ, టీజీ వెంకటేశ్

అయిదు తరగతులకు ఒక్కరే గురువు



ఆర్.జమ్ములదిన్నె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు లేక ఐదు తరగతులకు ఒక్కరే బోధించే పరిస్థితి నెలకొంది. గత మండల విద్యాశాఖాధికారులు ఆర్.పాంపల్లె ప్రాథమిక పాఠశాల నుంచి డిప్యుటేషన్‌పై మరొకర్ని ఆర్.జమ్ములదిన్నెకు బదిలీ చేశారు. ఈ ఏడాది జులై 4న ఆర్.జమ్ములదిన్నెలో విధులు నిర్వహించాలని మండల విద్యాశాఖాధికారి వీర ప్రతాప్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేసినా కాగితాలకే పరిమితమయ్యాయి. పాఠశాలలో ఉపాధ్యాయుడు నరసింహనాయక్ ఒక్కరే బోధించలేరనే భావనతో తల్లిదండ్రులు ఆళ్లగడ్డ ప్రైవేటు పాఠశాలలకు పిల్లల్ని పంపిస్తున్నారు. ఉన్న 37 మందికి రోజూ అయిదు తరగతుల్లోని అన్ని పాఠ్యాంశాలను తానొక్కరే బోధించడం భారంగా మారిందని నరసింహనాయక్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జులై 31న మండల సర్వసభ్య సమావేశంలో ఆర్.జమ్ములదిన్నె ఎంపీటీసీ సభ్యుడు బాలిరెడ్డి, సర్పంచి ప్రసాద్ యాదవ్ సమస్యను తెలియజేసినా ఇప్పటికీ చర్యలు తీసుకోలేదని పిల్లల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. –న్యూస్‌టుడే, ఆర్.జమ్ములదిన్నె(ఉయ్యాలవాడ)

యాగంటిలో ప్రత్యేక పూజలు



యాగంటి(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండల పరిధిలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఏపీఈఆర్‌సీ ఛైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి ఆదివారం పూజలు చేశారు. ఆలయాధికారి చంద్రుడు ఆధ్వర్యంలో అర్చకులు ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన్ని సత్కరించి స్వామి ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. పాతపాడు సర్పంచి మహేశ్వరరెడ్డి, యాగంటిపల్లి మౌళీశ్వరరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జస్టిస్ నాగార్జునరెడ్డికి స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయాధికారి చంద్రుడు తదితరులు

అక్కా.. అమ్మ నిద్రపోయిందా!

☛ ఆగిన కన్న తల్లి గుండె... తల్లడిల్లిన కనుపాపలు

కూలిపనులకు వెళ్లిన తల్లి రోజూ కన్నా.. కొంత ముందుగానే ఇంటికి వచ్చారు. అమ్మ వచ్చిందని ముగ్గురు పిల్లలు ఆమె వద్దకు పరుగున చేరారు. పిల్లలను ఒడిలోకి తీసుకొని ముద్దాడారు. ఇంటి వసారాలో ఉన్న మంచంపై సేద తీరేందుకు నడుం వాల్చారు. అమ్మ అలసిపోయిందని పిల్లల అనుకున్నారు. కొద్దిసేపటి తర్వాత అమ్మా.. అని పిలిచినా ఉలుకూ-పలుకూ లేదు. ఇరుగుపొరుగువారు పిలిచారు.. కదిలించి చూశారు. అప్పటికే ఆ తల్లి లోకాన్ని విడిచి వెళ్లిపోయారు. అక్కా.. అమ్మ నిద్రపోతోందా..? అని చిన్నారి అడిగిన తీరు చూసి, అక్కడి వారి కళ్లు చెమర్చాయి. ఆడుకుంటూ ఇంటి పట్టునే ఉండండి.. అల్లరి చేయొద్దు అని చెప్పే అమ్మ మాటలు మూగబోయాయి. ఆకలైతే అన్నం కలిపి తినిపించే. . గోరుముద్దలు దూరమయ్యాయి. తీవ్ర విషాదం నింపిన ఈ ఘటన పత్తికొండ మండలంలోని చందోలి గ్రామంలో ఆదివారం జరిగింది. – న్యూస్‌టుడే, పత్తికొండ గ్రామీణం

పత్తికొండ మండల పరిధిలోని చందోలి గ్రామానికి చెందిన టి.లక్ష్మి(35)ని తుగ్గలి మండలంలోని మారెళ్ల గ్రామానికి చెందిన అంజనయ్యకు ఇచ్చి వివాహం చేశారు. దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు. రెండేళ్ల కిందట లక్ష్మి భర్త అంజనయ్య గుండెపోటుతో మృతి చెందారు. అత్తగారింట నా అన్నవాళ్ల నుంచి ఆదరణ లేకపోవటంతో. . చిన్నారులతో కలిసి పుట్టింటికి చేరింది. అక్కడే కూలిపనులు చేసుకుంటూ పిల్లలను పోషిస్తూ.. కంటికి రెప్పలా చూసుకుంటూ జీవనం సాగించేది. ఆదివారం కూలిపనుల నుంచి ఇంటికొచ్చిన ఆమె.. సేద తీరుతూ తిరిగిరాని లోకాలకు వెళ్లింది.



తల్లి మృతదేహం వద్ద దిగులుగా కూర్చున్న చిన్నారులు

ఆ పిల్లల పరిస్థితి అగమ్యగోచరం

భర్త చనిపోయిన రెండేళ్లకే లక్ష్మి మృత్యు ఒడికి చేరింది. పుట్టింట్లో సైతం తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. ముగ్గురు ఆడపిల్లలు చదువుతున్న జయశ్రీ ఏడో తరగతి, అంకిత నాలుగో తరగతి చదువుతన్నారు. చిన్న కుమార్తె ఉషశ్రీకి ఐదేళ్లు. తల్లిదండ్రులు దూరమవడంతో ఇద్దరి పరిస్థితి దయనీయంగా మారింది. అప్పటి వరకు ఎంతో ఆప్యాయంగా పలకరించిన అమ్మ ఇక ఎప్పటికీ రాదన్న విషయం తెలియని ఆ చిన్నారులు తల్లి మృతదేహం వద్ద దిగులుగా కూర్చున్న దృశ్యం పలువురిని కలచివేసింది.



లక్ష్మి (పాత చిత్రం)

విధి రాసిన విషాద కావ్యం

పాలబుగ్గల పైనుంచి కన్నీటి ధార ఆగడం లేదు. ఆకలి తీర్చే అమ్మ కదలడం లేదు. ఏడుపు వింటే చాలు.. తల్లడిల్లే తల్లికేమైందో ఆ చిన్నారికి తెలియని పరిస్థితి. ఐదేళ్లకే అమ్మ దూరమైంది. ఇందుకు నాన్నే కారణమని అమ్మమ్మ గుండెపగిలేలా ఏడుస్తోంది. విధి విషాద 'కావ్య'ం రాసింది. ఏం జరిగిందో తెలియక బేలచూపులు చూస్తున్న ఆ చిన్నారిని చూసి, అక్కడి వారు కంటతడి పెట్టుకున్నారు.

- న్యూస్‌టుడే, ఆదోని నేరవార్తలు



పావని (పాత చిత్రం)

ఆదోని పట్టణం అమరావతినగర్‌లో అత్తారింటి వేధింపులు తాళలేక పావని(22) అనే వివాహిత బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఆదివారం జరిగింది. ఒకటో పట్టణ సీఐ శ్రీరామ్, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఆదోని పట్టణం వాల్మీకినగర్‌కు చెందిన చిన్నగుంటె రంగన్న, నాగమ్మ దంపతుల రెండో కుమార్తె పావనిని ఆదోని పట్టణంలోని అమరావతినగర్‌లో నివాసం ఉంటున్న పురపాలక శాఖ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న శ్రీను అనే యువకుడితో మూడేళ్ల కితం వివాహం చేశారు. వీరికి ఐదు నెలల కుమార్తె కావ్య ఉంది. దసరా పండగ ఉండటంతో ఇటీవల పావని పుట్టింటికి వచ్చారు. శనివారం అత్తారింటికి పంపించారు. ఆదివారం ఉదయం పావని ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందని తమకు సమాచారం అందిందని తల్లిదండ్రులు తెలిపారు. అక్కడికి వెళ్లి చూసే సరికి తమ కుమార్తె చనిపోయి ఉందని తండ్రి కంటతడి పెట్టాడు. విషయం తెలుసుకున్న ఒకటో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. తమ కుమార్తెను భర్త, అత్తింటి వారి వేధింపుల వల్లే ఈ అఘాయిత్యానికి పాల్పడిందని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐదు నెలల చిన్నారి కావ్య తల్లిప్రేమకు దూరమైంది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.



తల్లి ప్రేమకు దూరమైన చిన్నారి కావ్య

సహకారం.. సంసిద్ధం

☛ త్వరలో సంఘాలకు ఎన్నికలు

ఆళ్లగడ్డ సహకార సంఘం పరిధిలోని పి.చింతకుంటలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి ఆధ్వర్యంలో బహుళ ప్రయోజనకర గోదామును రూ.40 లక్షలతో నిర్మించారు. ఈ కేంద్రం సేవలు అందుబాటులోకి వస్తే పంటలో తేమ శాతాన్ని కొలిచే పరికరం, ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు పట్టలు, పంట నాణ్యతా ప్రమాణాలు కొలిచే పరికరాలు రైతుల సేవలకు సిద్ధంగా ఉంటాయి. ఇవన్నీ లేకపోవడంతో రైతులు ఇబ్బందులుపడుతున్నారు.



ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: సహకార సంఘాలకు ఆరునెలల్లో ఎన్నికలు నిర్వహిస్తారని తెలియడంతో రైతులు సంతోషిస్తున్నారు. ముగ్గురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు . ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటనతో ఇక ప్రగతిదాయక పాలన సొంతమవుతుందని రైతులు సంతోషిస్తున్నారు. రైతులు ఒక సంఘంగా ఏర్పడి, తమకు కావాల్సిన అవసరాలను తీర్చుకునేందుకు సహకార సంఘాల వ్యవస్థ దోహదపడుతోంది. రైతులకు అండగా ఉన్న ఈ సంఘాలు గత ప్రభుత్వ పాలనలో ఉనికిని కోల్పోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వైకాపా ఏర్పాటు చేసిన ముగ్గురు సభ్యుల కమిటీని రద్దు చేసింది. ఇప్పుడు పారదర్శకంగా పాలకవర్గాన్ని ఎన్నుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

రైతులకు అండదండగా...

ఉమ్మడి జిల్లాల్లో 99 సహకార సంఘాలు ఉన్నాయి. 2013లో సహకార సంఘాలకు అధికారికంగా ఎన్నికలు జరిగాయి. అధ్యక్షులుగా ఎన్నికైన వారు 2018 వరకు బాధ్యతల్లో ఉన్నారు. అప్పుడు అధికారంలోకి ఉన్న తెదేపా ప్రభుత్వం ఈ సంఘాల పదవీ కాలాన్ని ఏడాది పెంచి తర్వాత ఎన్నికలు నిర్వహించాలని భావించింది. 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడం సహకార సంఘాలను స్థానిక నాయకుల కనుసన్నల్లో పనిచేసే వారికి అప్పగించడం జరిగింది. గతంలో సహకార సంఘాలే రైతులకు అన్ని విధాలుగా అండగా ఉండేవి. సంఘంలోని రైతులే తమ ఓటుహక్కుతో అధ్యక్షుడిని, సభ్యులను ఎన్నుకునేవారు. సహకార సంఘాలు రైతులకు పంట సాగుకు పెట్టుబడి సాయం మొదలు రైతులకు కావాల్సిన ఎరువులను, పురుగు మందులను రాయితీపై అందించడంలో కీలక పాత్ర పోషించేవి.. రైతులు తాము పండించిన ఉత్పత్తులకు తగిన ధర వచ్చే వరకు నిల్వ ఉంచుకునేందుకు గోదాములు, తమ బ్యాంకుల ద్వారా రైతులకు వడ్డీ లేకుండా రుణాలు అందించేవి. నేడు ఈ సంఘాలతో అరకొర రుణాలు ఇప్పించడం మినహా ఏ రకమైన ఉపయోగం చేకూరడం లేదు. ఆళ్లగడ్డ పట్టణంలో నడిబొడ్డున విలువైన స్థలం నేడు వృథాగా మారింది. ఆళ్లగడ్డ, బత్తలూరులోనూ గోదాముల నిర్మాణాలకు ఎనిమిదేళ్ల కిందట అనుమతులు వచ్చినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. కొత్తగా పి.చింతకుంటలో గోదాము నిర్మాణం పూర్తి చేసుకున్నా ఇంకా అందుబాటులోకి రాలేదు. గత ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఉపయోగం అందించలేని ఆర్బీకే కేంద్రాలపై ప్రేమ చూపిస్తూ రైతులకు అన్ని విధాలుగా అండగా నిలిచిన సహకార సంఘాలపై సవతితల్లి ప్రేమ చూపించిందన్న ఆరోపణలను మూటగట్టుకుంది. సహకార సంఘాల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

గోదాములు వృథా

నంద్యాలలో 1000 మెట్రిక్‌టన్నుల సామర్థ్యం ఉన్న గోదాములు 66, 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న 78 గోదాముల నిర్మాణం పూర్తయినా అవి వృథాగా మారాయి. గోదాముల నిర్మాణానికి రూ.77.40 కోట్లు ఖర్చు చేసినా వృథాగా మారడంతో తెదేపా హయాంలోనైనా ఇవి ఉపయోగంలోకి రాగలవని రైతులు భావిస్తున్నారు.

ఆనందం.. అంతలోనే విషాదం

☛ బస్సు, ద్విచక్రవాహనం ఢీ.. ఇద్దరి దుర్మరణం

తాడిపత్రి, న్యూస్‌టుడే : అప్పటి వరకు సంబరంగా గడిపిన ఆ కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. అనుకోని విధంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కుటుంబాల్లో ఇద్దరు మృత్యువాత పడ్డారు. మృతుల్లో ఒకరు తొమ్మిదేళ్ల బాలుడు ఉండటం అందర్నీ కలచి వేసింది. ఇదే ప్రమాదంలో గాయపడిన బాలుడి తల్లి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో కొట్టుమిట్టాడుతోంది. యాడికిలోని రాఘవేంద్ర కాలనీకి చెందిన చరణ్‌రాజ్ కుటుంబం, అదే కాలనీలో ఉన్న అతని సోదరి సుమిత్ర, బావ రాముడు కారు, ద్విచక్రవాహనంపై బంధువుల్లో ఓ బాలుడి కేశఖండన మహోత్సవానికి ఆదివారం నార్పల మండలం మద్దలపల్లికి బయలుదేరి వెళ్లారు. చరణ్‌రాజ్ కార్యక్రమాన్ని ముగించుకొని అతని భార్య మనీషా ద్విచక్రవాహనం, అతని సోదరి కుటుంబం, తల్లిదండ్రులు కారులో తిరుగు ప్రయాణమయ్యారు. తాడిపత్రిలోకి రాగానే సుమిత్ర దంపతుల కుమారుడు లక్ష్మీరామ్ మామ చరణ్‌రాజ్ ద్విచక్రవాహనంలో వెళ్తానని మొండికేయడంతో ఎక్కించారు. అక్కడి నుంచి యాడికి బయలుదేరగా చుక్కలూరు గ్రామం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొనింది. ఈ ఘటనలో చరణ్‌రాజ్(30), లక్ష్మీరామ్(9) అక్కడికక్కడే మృతి చెందగా మనీషాకు తీవ్ర గాయాలయ్యాయి. చరణ్‌రాజ్ సొంత జిల్లా నంద్యాల జిల్లా కోవెలకుంట్ల మండలం బిజినవేముల గ్రామం కాగా ఐదేళ్ల కిందట యాడికిలో స్థిరపడ్డారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు.

ఎత్తులతో చిత్తు

☛ చదరంగంలో రాష్ట్రస్థాయి గుర్తింపు



గాదంశెట్టి సోహన్

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: చదరంగంలో ఆళ్లగడ్డ క్రీడాకారులు రాణిస్తూ నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన సోహన్ ఒకవైపు పతకాలు సాధిస్తూనే ఫిడే రేటింగ్‌లోనూ సత్తా చాటుతున్నారు. శిక్షకుడు ఇమామ్ ఆధ్వర్యంలో తర్ఫీదు పొందుతున్న సోహన్ ఎలో రేటింగ్‌లు సాధించడంలో పేరు తెచ్చుకుని జాతీయ స్థాయిలో రాణించేందుకు సిద్ధమవుతున్నారు.

గతేడాది ఇలా..!

గతేడాది నెల్లూరులో జరిగిన రేటింగ్ పోటీల్లో సోహన్ అద్భుత ప్రతిభ చూపించారు. ఫిడే ర్యాంకింగ్‌లో 1022 ఎలో రేటింగ్ సాధించారు. ర్యాపిడ్ చెస్‌లో(వేగంగా ఎత్తులు) విభాగంలోనూ 1252 ఎలో రేటింగ్‌లు సాధించారు. హోసూరులో జరిగిన ఆలిండియా చెస్ టోర్నమెంట్‌లో జాతీయస్థాయి పోటీల్లో అండర్-13 విభాగంలో పోటీ పడి మూడో స్థానంలో నిలిచారు. ఈ నెల 17న కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ సోహన్ ప్రతిభ చూపించారు. కర్నూలులో 350 మంది క్రీడాకారులు పాల్గొన్న రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో అద్భుత ప్రతిభ చూపించారు. నాలుగో స్థానం సాధించి మెమెంటో, నగదు బహుమతి అందుకున్నారు. ఇంతకు ముందు గతేడాది అగస్టులో నంద్యాలలో జిల్లాస్థాయి ఓపెన్ విభాగంలో రెండో స్థానం సాధించారు. చదరంగం బోర్డుపై ఊహలకు అందకుండా వేగంగా ఎత్తులు వేస్తూ ప్రత్యర్థులను చిత్తుచేయడంలో సోహన్‌ది అందెవేసిన చేయి. జీవితంలో మరింత మెరుగైన ఆటతీరుతో ఉన్నతస్థానాలకు చేరుకోవాలనుందని సోహన్ చెబుతున్నారు.

ఉరేసుకుని బలవన్మరణం

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: అవుకు మండలంలోని రామాపురానికి చెందిన వి.మహేశ్ (32) ఆత్మహత్య చేసుకున్నారని ఎస్సై రాజారెడ్డి ఆదివారం చెప్పారు. గ్రామానికి చెందిన మహేశ్ గత కొన్ని రోజుల నుంచి మద్యానికి బానిసై, జీవితంపై విరక్తి చెందారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పంకాకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడికి భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజారెడ్డి పేర్కొన్నారు.

ద్విచక్రవాహనాల చోరీ ఘటనలో అరెస్టు

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాల చోరీ కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు కోవెలకుంట్లలో ఆదివారం ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్ వివరాలు తెలిపారు. ఈనెల 15న రాత్రి కోవెలకుంట్లలో పల్సర్ వాహనం చోరీ చేశారని బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తుప్రారంభించారు. వైఎస్సార్ జిల్లాలోని జమ్మలమడుగుకు చెందిన హుస్సేన్‌వలి, ప్రొద్దుటూరుకు చెందిన షేక్ ఫజిల్, మైదుకూరుకు చెందిన వాదనపల్లి అమీర్‌బాషా, మరో ముగ్గురు నంద్యాల, వైఎస్సార్ జిల్లాల్లో ద్విచక్రవాహనాలు చోరీ చేశారని, గత ఎనిమిది నెలల్లో 11 వాహనాలు దొంగిలించి వాటి ఇంజిన్లు, ఛాసిస్ నంబర్లు మార్చి సెకండ్ హ్యాండ్ ద్విచక్రవాహనాలుగా విక్రయించే వారని డీఎస్పీ తెలిపారు. వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామని, 11 ద్విచక్రవాహనాలు, 4 నకిలీ రిజిస్ట్రేషన్ కార్డులు, చరవాణి, ల్యాప్‌టాప్, స్ప్రే పెయింట్ బాటిల్, నంబర్ డిలీటింగ్, ప్రింటింగ్ యంత్రాలు, స్టెయిన్‌లెస్ స్టీల్‌స్కేళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కోర్టులో హాజరు పరిచి రిమాండుకు తరలిస్తున్నామన్నారు. సీఐ హనుమంతనాయక్, ఎస్సై మల్లికార్జునరెడ్డి, కానిస్టేబుళ్లు కృష్ణనాయక్, మాలిక్, వెంకటేష్ నాయక్, సుధీర్, సుబ్బరాయుడు, హోంగార్డు చెన్నయ్యలను ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా అభినందించారన్నారు.



పట్టుబడిన నిందితులతో డీఎస్పీ, సీఐ, ఎస్సైలు

మహిళ హత్య కేసులో ముగ్గురికి రిమాండ్

నందికొట్కూరు, న్యూస్‌టుడే : నందికొట్కూరు మండలం నాగటూరు గ్రామానికి చెందిన శిరీష హత్య కేసులో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మృతురాలి సోదరుడు అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. పట్టణం శివారులోని మదరసా వద్ద మృతురాలి మామ కురుమన్న, భర్త నరసింహ, అత్త మహేశ్వరిని ఆదివారం అరెస్టు చేసి నందికొట్కూరు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు చెప్పారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణం విశ్వనగర్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్ (29) విష ద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు రెండో పట్టణ సీఐ ఇస్మాయిల్ ఆదివారం తెలిపారు. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విశ్వనగర్‌కు చెందిన కృష్ణవేణి కుమారుడు ప్రవీణ్‌కుమార్ బంగారు దుకాణం నడుపుతూ కుటుంబాన్ని పోషించేవారు. ఏడాది కిందట తండ్రి గోపాల్ అనారోగ్యంతో మృతి చెందారు. తండ్రి లేడన్న మనస్తాపంతో శనివారం రాత్రి ఇంట్లో విష ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గుర్తించిన కుటుంబ సభ్యులు స్థానిక సర్వజన ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడి తమ్ముడు గణేశ్ కల్యాణ్ ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

JOBS

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/ షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం॥ Cell: 7382114647.

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ / చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం 18K. ✆ 96402 58899, 96404 68899.

REAL ESTATE

LAND FOR SALE

నల్లరేగడి వ్యవసాయ భూమి 13 ఎకరాలు పుష్కలమైన సాగునీటి సదుపాయంతో తుమ్మెల గ్రామం, రాజోలి మండలం, జోగులాంబ (గద్వాల్) జిల్లా, తెలంగాణాలో అమ్మబడును. ✆ 92461 96829.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.

కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.

ప్రకటనలపై 5% GST వర్తించును.

వివరాలకు: 99899 97628

LEASE/ RENT

హాస్పిటల్ బిల్డింగ్ 9500 చ.అ.లు G+3 కల్గిన బుధవారపేట, కర్నూలులో లీజుకు కలదు. సం. 98481 60885.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

నంద్యాల

•నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఆత్మకూరు తెదేపా కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఆదివారం ముఖ్యమంతి సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ జబ్బులతో బాధపడే పేదలకు సీఎం అండగా నిలుస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలో 26 మందికి రూ.23 లక్షల చెక్కులు మంజూరయ్యాయన్నారు.

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను జిల్లా తెదేపా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. స్థానిక మంత్రి ఫరూక్ కార్యాలయంలో ఆదివారం రూ.7.60 లక్షల విలువ చేసే చెక్కులను ఆయన అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 11 మంది కుటుంబాలకు ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీదేవి, నాయకులు తిమ్మయ్య, జోజిరెడ్డి, జయచంద్రారెడ్డి, మాబాషా, త్రిలింగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో జిల్లా న్యాయమూర్తి పూజలు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని ఎస్.కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నంద్యాల జూనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ ఆదివారం పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకుని క్షీరాభిషేకం, అర్చనలు జరిపించారు. అనంతరం న్యాయమూర్తిని ఆలయ మర్యాదలతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేసినట్లు ఈవో రామకృష్ణ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) నందికొట్కూరు : 94403 61729 ఆత్మకూరు : 90149 09024 నంద్యాల : 98853 28120

నంద్యాల పురపాలకం : సమస్య : నంద్యాల పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో కుక్కల బెడద అధికమైంది. **- అనిల్‌బాబు, స్థానికుడు**

సమస్య : జ్ఞానాపురంలో వీధి కుక్కల దాడులు పెరిగిపోయాయి. **- కృష్ణ, స్థానికుడు**

సమస్య : ఎస్బీఐకాలనీలో కాల్వలు శుభ్రం చేయడం లేదు. **- కిషోర్, స్థానికుడు**

సమాధానం : త్వరలోనే కుక్కలను పట్టించి సమస్యను పరిష్కరిస్తాం. కాల్వలు శుభ్రం చేయిస్తాం. **- లక్ష్మీనారాయణశర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

పగిడ్యాల : సమస్య : పడమర ప్రాతకోట గ్రామం ఎస్సీకాలనీలో తాగునీటి కుళాయి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. **- అనిల్, స్థానికుడు**

సమాధానం: పరిశీలించి పరిసరాలు శుభ్రం చేయిస్తాం. **- ఇసాక్, పంచాయతీ కార్యదర్శి**

సమస్య : పాత ముచ్చుమర్రి గ్రామం హరిజనవాడలోని మురుగు కాల్వలు పూడిపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయి. **- భరత్, స్థానికుడు**

సమాధానం : పారిశుద్ధ్య కార్మికులకు సూచించి కాల్వలు శుభ్రం చేయిస్తాం. **- పెద్ద ఆంజనేయులు, సర్పంచి**

సమస్య : లక్ష్మాపురం గ్రామం బేడ బుడగజంగాల కాలనీలో మురుగు కాల్వల్లేక వర్షంనీరు వీధుల్లో నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **- హుశేనాలం**

సమాధానం : ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం. **- నారాయణమ్మ, పంచాయతీ కార్యదర్శి**

సమస్య : ఘణపురం గ్రామంలో రహదారులు అపరిశుభ్రంగా మారాయి. **- హరి, స్థానికుడు**

సమాధానం : పారిశుద్ధ్య కార్మికులకు సూచించి రోడ్లను శుభ్రం చేయిస్తాం. **- శ్వేత, పంచాయతీ కార్యదర్శి**

ఆత్మకూరు పట్టణం : సమస్య : రంగమహల్ థియేటరుకు వెళ్లే మార్గంలో వాల్వ్ మరమ్మతుల కోసం తవ్విన గుంత పూడ్చలేదు. **- రాజు, స్థానికుడు**

సమస్య : కస్తూర్బా లేఅవుట్ కాలనీలో రెండు వీధిదీపాలు వెలగడం లేదు. **- నాగరాజు, స్థానికుడు**

సమాధానం : గుంతను పూడ్చివేయిస్తాం. వీధిదీపాలకు మరమ్మతులు చేయిస్తాం. **- షాహీర్‌బాషా, పురపాలక ఏఈ**

మధ్యంతర భృతి ప్రకటించాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం దీపావళి కానుకగా 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఏపీడీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యుడు కె.సాంబశివుడు, జిల్లా ప్రధాన



మాట్లాడుతున్న సాంబశివుడు

కార్యదర్శి నగిరి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. స్థానిక సంఘం జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 2023 జులై నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనర్లకు అమలు కావాల్సిన 12వ పీఆర్సీ ఆలస్యం అవుతున్నందున మధ్యంతర భృతి చెల్లించాలన్నారు. జిల్లా అదనపు కార్యదర్శి మల్లెల పుల్లయ్య, కార్యదర్శులు పవన్‌కుమార్, మునిస్వామి, రవి, నగరి వెంకటేశ్వర్లు, గోపాల్‌రావు, జయరామ్, వెంకటకృష్ణుడు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : నంద్యాలను నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంతో పలు అనుమానిత ప్రాంతాల్లో నాకాబందీ నిర్వహించినట్లు ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి వారి ప్రవర్తనలో మార్పు తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు.

అక్రమాలు అనేకం.. విచారణ నామమాత్రం

■ పెద్దఎత్తున అనర్హులకు కౌలుపత్రాల జారీ

■ మరోసారి లోకాయుక్తకు కరిమద్దెల గ్రామస్థుల ఫిర్యాదు

పాణ్యం, న్యూస్‌టుడే : కౌలుకార్డు ఉంటే చాలు రైతు భరోసా వస్తుంది. పంట నష్ట పరిహారం అందుతుంది. దీన్ని ఆసరా తీసుకొని అధికారులు అక్రమ సంపాదనకు పాల్పడ్డారు. భూములు కౌలుకు తీసుకోని వారి పేరుతో వందల సంఖ్యలో కౌలు కార్డులు మంజూరు చేశారు. వాటిని అడ్డుపెట్టుకుని రైతు భరోసా, పంట నష్టపరిహారం సొమ్ము స్వాహా చేశారు. ఈ అక్రమాలపై రైతులు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దీంతో లోకాయుక్త విచారణకు ఆదేశించింది. ఆ విచారణ పారదర్శకంగా జరగలేదని.. ఒకట్రెండు కార్డులు మాత్రమే విచారించి అక్రమాలను కప్పిపెట్టారని ఆరోపిస్తూ రైతులు మరోసారి లోకాయుక్తకు ఫిర్యాదు చేయడం గమనార్హం.

★ గడివేముల మండలంలో కౌలుకార్డుల జారీలో పెద్ద సంఖ్యలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు రైతులు చెబుతున్నారు. కరిమద్దెలలో సుమారు 314 కౌలుకార్డులు మంజూరు చేశారు. మూడేళ్ల పాటు ఈ కార్డులు చెలామణి అయ్యాయి. గ్రామంలో నివాసం లేని వారికి, భూములు కౌలుకు తీసుకోని వారికి కూడా కార్డులు మంజూరు చేశారు. ఇలా కౌలుకార్డుల మంజూరులో భారీగా అక్రమాలు జరిగాయని గ్రామస్థులు 2023లో లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. అక్రమార్కులకు కౌలుపత్రాలు మంజూరు చేసి రైతుభరోసా సొమ్ము, పంట నష్ట పరిహారం కాజేశారని ఫిర్యాదులో ఆరోపించారు. దీనిపై లోకాయుక్త విచారణకు ఆదేశించింది.



రైతులను విచారిస్తున్న అప్పటి జిల్లా వ్యవసాయాధికారి, ఏడీఏ (పాతచిత్రం)

అనర్హులకు ఇచ్చింది రెండేనట

మొదట ఏడీఏ రాజశేఖర్‌బాబు విచారణ చేశారు. ఆ విచారణ పారదర్శకంగా లేదని రైతులు లోకాయుక్త దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని జేసీతో పాటు జిల్లా వ్యవసాయాధికారిని ఆదేశించారు. దీంతో అప్పటి జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు, ఏడీఏ రాజశేఖర్‌బాబు గ్రామంలో విచారణ చేపట్టారు. పెసరవాయి గ్రామ పొలిమేరలో రెండు కౌలుకార్డుల మంజూరులో అక్రమాలు జరిగాయని, సుమారు రూ.30 వేలు రికవరీ చేసినట్లు వారు లోకాయుక్తకు నివేదించారు. గ్రామ రెవెన్యూ అధికారి తప్పిదం వల్లే అక్రమాలు చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. ప్రాథమిక తప్పిదంగా భావించి అతన్ని హెచ్చరించి వదిలేశారు. వ్యవసాయశాఖ అధికారుల తప్పిదం లేదని తేల్చారు.

అక్రమాలను కప్పిపెట్టారు

కౌలుపత్రాల మంజూరులో భారీగా అక్రమాలు జరిగినా విచారణలో అధికారులు వాస్తవాలను తొక్కిపెట్టారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామ పరిధిలో వారు గుర్తించిన కొన్ని అక్రమాలను వెల్లడించారు.

★ గ్రామానికి చెందిన రైతు డాలు స్వామిరెడ్డి గాండ్ల జగన్‌మోహన్‌కు భూమి కౌలుకు ఇచ్చినట్లు చూపి కౌలుకార్డు సంఖ్య 13320103603 మంజూరు చేశారు. గాండ్ల జగన్‌మోహన్‌రెడ్డి గ్రామంలో లేడని స్థానికులు చెబుతున్నారు.

★ రైతు ఉదయగిరి విశ్వనాథంశెట్టి పిక్కిలి వెంకటాచలంకు భూమిని కౌలుకు ఇచ్చినట్లు చెబుతూ కౌలు కార్డు సంఖ్య 13320103513 మంజూరు చేశారు. ఈ కార్డు తీసుకున్న వ్యక్తి కూడా గ్రామంలో లేడని రైతులు తెలిపారు.

★ శీల్ల రామగోపాల్ అనే రైతు మహిళా రైతు శిల్పకు పొలం కౌలుకు ఇచ్చినట్లు 2626010043055 సంఖ్యతో కౌలుపత్రం ఇచ్చారు. తన భూమిని ఎవరికీ కౌలుకు ఇవ్వలేదని రైతు విచారణ అధికారుల ఎదుట స్పష్టం చేశారు.

★ శీల్ల రామసుబ్బయ్య తన పొలాన్ని వడ్డె నాగేశ్వరమ్మకు కౌలుకు ఇచ్చినట్లు చూపి 2626010085354 సంఖ్యతో కౌలుకార్డు ఇచ్చారు. ఈయన కూడా తాను భూమిని కౌలుకు ఇవ్వలేదని విచారణ అధికారుల ఎదుట వెల్లడించారు.

★ తమ గ్రామంతో పాటు మండలంలో వందలాది కౌలు కార్డులు అక్రమంగా మంజూరు చేశారని వాటి గురించి విచారణ చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



బావుల మార్గం.. భక్తులకు నరకం

మహానంది క్షేత్రం నుంచి మహానంది ఫారం మీదుగా బోయిలకుంట్ల మెట్ట ప్రధాన రహదారికి వెళ్లే అడుగడుగునా భారీ గోతులతో ప్రమాదకరంగా మారింది. గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోతులు మరింత లోతుగా మారి బావులను తలపిస్తున్నాయి. మహానంది నుంచి 3 కి.మీ ఉన్న ఈ దారిలో వందలాది గుంతలు ఏర్పడి భక్తులు, యాత్రికులు, స్థానికులు, రైతులు రాకపోకలు సాగించేందుకు అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు. ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ కళాశాల, వేంకటేశ్వర ఒంగోలు జాతి పశు పరిశోధనా స్థానం, వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా స్థానం, ఆర్ఎస్ గాజులపల్లెలోని రైల్వేస్టేషన్‌కు చేరుకునేందు ఈ రహదారే ఆధారం. కీలకమైన రోడ్డు దారుణంగా దెబ్బతినడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. **- న్యూస్‌టుడే, మహానంది**

గ్రామాల సమగ్రాభివృద్ధికే పల్లె పండగ

ఆత్మకూరు, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లె పండగ కార్యక్రమంలో గ్రామాల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

పల్లె పండగ- పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంకటాపురం గ్రామంలో రూ.45.50 లక్షలు, కురుకుందలో రూ.40 లక్షలు, వడ్ల రామాపురంలో రూ.35 లక్షలు, శ్రీపతిరావుపేటలో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తిరుపాలమ్మ, సర్పంచి గంగాదేవి, తెదేపా నాయకులు రాజారెడ్డి, శివప్రసాదరెడ్డి, వేణుగోపాల్, నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామాల అభివృద్ధి తెదేపాతోనే సాధ్యమని ఎమ్మెల్యే జయసూర్య పేర్కొన్నారు. నందికొట్కూరు మండలం శాతనకోట, మల్యాల, పాములపాడు మండలంలోని తుమ్మలూరు, కృష్ణారావుపేట గ్రామాల్లో ఆదివారం ఆయన పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా సీసీ రహదారుల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. తెదేపా నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



తుమ్మలూరు గ్రామంలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

జూలేపల్లె (గోస్పాడు), న్యూస్‌టుడే : గ్రామ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం పల్లె పండగ వారోత్సవాలు నిర్వహిస్తోందని తెదేపా మండల ఇన్‌ఛార్జి కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని జూలేపల్లెలో గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంపీడీవో అమానుల్లా, తులసీశ్వరరెడ్డి ఆదివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ నాగఅనసూయ, ఏపీవో నాగజ్యోతి, అధికారులు, తెదేపా గ్రామ నాయకులు పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతిక రంగాలపై అవగాహన పెంచాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక రంగాలపైన అవగాహన పెంపొందించాలని సీనియర్ న్యాయవాది శంకరయ్య పేర్కొన్నారు. డిసెంబరులో నిర్వహించనున్న నంది బాలోత్సవాలకు సంబంధించి స్థానిక వివేకానంద ఆడిటోరియంలో ఆదివారం ఆహ్వాన సంఘ సమావేశం నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నంది విజ్ఞాన కేంద్రం కన్వీనర్ రామరాజు, బేతంచెర్ల ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ మరియదాసు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు టి.నిర్మల, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకుడు గోపాల్, నంద్యాల ప్రైవేటు ఉపాధ్యాయుల సంఘం పట్టణ కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ.. ఈ ఏడాది నంద్యాలలో బాలోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం నంది ద్వితీయ బాలోత్సవం ఆహ్వాన సంఘం కమిటీని ఎన్నుకున్నారు.

చదరంగం ఏకాగ్రత పెంచుతుంది

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : చదరంగం క్రీడ విద్యార్థుల్లో ఏకాగ్రత పెంచుతుందని, మెదడుకు పదును పెడుతుందని ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డా.రవికృష్ణ పేర్కొన్నారు.



చెస్ పోటీలు ప్రారంభిస్తున్న సంఘం సభ్యులు

స్థానిక కాంతినగర్‌లోని శాంతినికేతన్ పాఠశాలలో నంద్యాల జిల్లా ర్యాపిడ్, బ్లిట్జ్ చదరంగం జట్టు ఎంపిక పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డా.రవికృష్ణ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్ ప్రారంభించారు. ఇక్కడ ఎంపికైన జట్లు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జరగబోయే రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గజ్జ కట్టు వేడుకలు

నంద్యాల గాంధీచౌక్, పాతపట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణానికి చెందిన పలువురు చిన్నారులు కూచిపూడి నృత్యం నేర్చుకుని ఏడాది పూర్తయిన సందర్భంగా హౌసింగ్ బోర్డు కాలనీలోని స్ఫటిక



విద్యార్థులకు గజ్జకడుతూ పూజలు చేయిస్తున్న నిర్వాహకులు

లింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం గజ్జ కట్టు వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులకు శిక్షకుడు సురేష్ గజ్జ కట్టి పోటీలు ప్రారంభించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నటరాజస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

షేక్షావలిరెడ్డికి అబ్దుల్‌కలాం ప్రతిభా పురస్కారం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల శ్రీగురురాజా పాఠశాల సంచాలకుడు పెద్దిరెడ్డి షేక్షావలిరెడ్డి ఏపీజే అబ్దుల్‌కలాం జాతీయ ప్రతిభా అవార్డు అందుకున్నారు. సదరన్ ప్రైవేటు అధ్యాపకులు, ఉపాధ్యాయుల సంస్థ ఆధ్వర్యంలో విజయవాడలోని ఏపీ కాలేజ్ అసెంబ్లీ హాల్‌లో ఆదివారం ఈ పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్‌రావు, మలినేని విద్యా సంస్థల ఛైర్మన్



అవార్డు అందుకుంటున్న షేక్షావలిరెడ్డి

మలినేని పెరుమాళ్లు, గుంటూరు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్, ఏఎన్‌యూ ఎగ్జిక్యూటివ్ సభ్యులు డా.వి.కన్నా, కాటూరి వెంకటేశ్వరరావు, మేకల రవీంద్రబాబు, ఏసీ కళాశాల ప్రిన్సిపల్ మోజెస్ తదితరులు షేక్షావలిరెడ్డికి అవార్డును అందజేశారు.

భక్తిశ్రద్ధలతో సంకష్టహర చతుర్థి

నంద్యాల గాంధీచౌక్, పాతపట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణం ఆత్మకూరు బస్టాండు ప్రాంతంలోని లక్ష్మీ గణపతి ఆలయంలో ఆదివారం సంకష్టహర చతుర్థి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామునే పంచామృత అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు చేశారు. అనంతరం హోమం నిర్వహించారు.

★ నాగులకుంట రోడ్డులోని నాగలింగేశ్వర స్వామి ఆలయంలో కూడా సంకష్టహర చతుర్థి పూజలు చేశారు. సాయంత్రం స్వామివారికి అభిషేకం, అర్చనలు నిర్వహించారు.

పట్టణ కూలీలకు ఉపాధి పనులు కల్పించాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఆత్మకూరు పట్టణానికి చెందిన వ్యవసాయ కూలీలకు ఉపాధిహామీ పనులు కల్పించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్ డిమాండ్ చేశారు. స్థానిక వెంగళరెడ్డి కాలనీలో ఆదివారం పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేరళ, త్రిపుర, పశ్చిమబెంగాల్లో వామపక్ష ప్రభుత్వాలు పట్టణ ఉపాధిహామీ పథకం అమలు చేశాయన్నారు. మన రాష్ట్రంలోనూ పురపాలక సంఘాలు, పట్టణాల్లో ఉపాధి పనులు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామ్‌నాయక్, సురేంద్ర, ఇస్మాయిల్, శివుడు, గణపతి, రాముడు, కలీముల్లా తదితరులు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో బీసీలకు అన్యాయం

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అన్యాయం జరుగుతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు యాదవ్ పేర్కొన్నారు. ఆత్మకూరులోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్ల కలిగే నష్టం గురించి, రాష్ట్ర ప్రభుత్వం బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీల అమలు గురించి సమావేశంలో చర్చించారు. చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. నాయకులు రామకృష్ణ, బాలస్వామియాదవ్, నారాయణ, శ్రీహరి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించండి

పగిడ్యాల, న్యూస్‌టుడే : శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని నందికొట్కూరు గ్రామీణ సీఐ సుబ్రహ్మణ్యం కోరారు. ఆయన ఆధ్వర్యంలో పాత



ముచ్చుమర్రి గ్రామంలో పోలీసు సిబ్బంది

ముచ్చుమర్రి గ్రామంలో ఆదివారం పోలీసు సిబ్బంది కవాతు నిర్వహించారు. జూపాడుబంగ్లా ఎస్సై లక్ష్మీనారాయణ, నందికొట్కూరు ఎస్సై వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

గడివేముల, న్యూస్‌టుడే : గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని పెసరవాయి గ్రామంలో ఆదివారం నాకాబందీ నిర్వహించారు. రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వారి ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. అనంతరం గ్రామస్థులతో నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై నాగార్జునరెడ్డి, క్యూఆర్టీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వనరులను దోచిపెడుతున్న కేంద్రం

మిడుతూరు, న్యూస్‌టుడే : దేశంలోని ప్రకృతి వనరులను మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు దోచి పెడుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్ ఆరోపించారు. మిడుతూరులోని జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం సీపీఎం మండల మూడో మహాసభలను నాయకుడు రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగేశ్వరరావు, నాయకులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగు నెలలైనా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడం లేదని విమర్శించారు. నాయకులు నాయుడు, కాశి, షేక్షావలి, హరి తదితరులు పాల్గొన్నారు.



సీపీఎం జెండా ఆవిష్కరిస్తున్న జిల్లా నాయకులు

డ్రైవర్ల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : డ్రైవర్లకు ఇబ్బందికరంగా మారిన చట్టాలను రద్దు చేయాలని అఖిల భారత రహదారి రవాణా కార్మికుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన



మాట్లాడుతున్న ముజఫర్ అహ్మద్

కార్యదర్శి ముజఫర్ అహ్మద్ డిమాండ్ చేశారు. డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. నంద్యాలలో రహదారి రవాణా కార్మికుల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కార్యశాలలో రెండోరోజు ఆదివారం ట్రాన్స్‌పోర్టు కార్మికులపైన భారాలు, ప్రభుత్వాల విధానాలు అనే అంశంపై ముజఫర్ అహ్మద్ మాట్లాడారు. రాష్ట్రంలో రవాణా కార్మికుల కుటుంబాలను ఆదుకోవడం కోసం ప్రభుత్వాలు చర్యలు చేపట్టకపోతే ఉద్యమాలు తీవ్రం చేస్తామని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా డ్రైవర్లు ఐక్య పోరాటం చేయాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివాజీ, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు, ఆటో కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ఎల్లయ్య, నాయకులు వీరసేన, శ్రీనివాసరావు, పోలినాయుడు, సురేశ్, హరి పోతరాజు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న భక్తులకు మరుగు కష్టాలు

శ్రీశైలం, సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే : ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో వసతుల కొరత భక్తులను వేధిస్తోంది. భ్రమరాంబ, మల్లికార్జున స్వామివార్ల దర్శనానికి నిత్యం వివిధ ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. వీరిలో సామాన్యులు, పేదలే అధికంగా ఉంటారు. కనీస అవసరాలైన మూత్రశాలలు, మరుగుదొడ్లు, స్నానపు గదులు అందుబాటులో లేక వీరంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కూల్చారు.. ప్రత్యామ్నాయం మరిచారు

శ్రీశైలానికి బస్సుల్లో వచ్చే భక్తులు ఇక్కడి ప్రధాన కూడలైన నందిసర్కిల్ వద్ద దిగుతారు. తిరిగి వెళ్లేందుకు ఇక్కడి నుంచే బస్సులు ఎక్కుతుంటారు. ఈ ప్రాంతంలో భక్తులు అధిక సంఖ్యలో ఉంటారు. గతంలో అన్నపూర్ణ సత్రం వెనుకభాగంలో మూత్రశాలలు, స్నానపు గదులు, మరుగుదొడ్లు భక్తులకు అందుబాటులో ఉండేవి. అభివృద్ధిలో భాగంగా వాటిని తొలగించి నంది సర్కిల్‌లో ఏర్పాటు చేశారు. గత 15 ఏళ్లుగా వీటిని భక్తులు ఉపయోగించుకొని స్నానాలు చేసి స్వామి, అమ్మవార్ల దర్శనం చేసుకునే వారు. అభివృద్ధి పనుల్లో భాగంగా గతనెల వీటిని తొలగించారు. ప్రత్యామ్నాయం చూపకపోవడంతో భక్తులకు అవస్థలు తప్పడం లేదు. అత్యవసరమైన వారు రహదారులపైనే మలమూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో రోడ్లు తీవ్ర అపరిశుభ్రంగా మారి భక్తులకు మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దేవస్థానం అధికారులు సామాన్యుల అవసరాలు తీర్చడంపై దృష్టిపెట్టడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



నంది సర్కిల్ వద్ద మరుగుదొడ్లు కూల్చిన ప్రదేశం

అత్యవసరమైతే అర కి.మీ వెళ్లాలి

రూ.లక్షలు ఖర్చుచేసి వలయ రహదారిలో మూడు నాలుగుచోట్ల కొత్తగా మరుగుదొడ్లు నిర్మించారు. ఇవి మహా శివరాత్రి, ఉగాది, ఇతర పర్వదినాల్లో మాత్రమే భక్తులకు ఉపయోగపడతాయి. దీంతో నిత్యం భక్తులు నంది సర్కిల్ నుంచి సుమారు అర కిలోమీటరు దూరంలోని పాతాళగంగ రహదారిలో ఉన్న మరుగుదొడ్ల వద్దకు వెళ్లి అవసరాలు తీర్చుకోవాల్సి వస్తోంది. అవి దుకాణాల మధ్యలో ఉండటంతో గుర్తించడం కష్టంగా మారిందని పలువురు వాపోతున్నారు. సూచిక బోర్డులు సైతం లేక పోవడంతో మరింత సమస్యగా మారింది. ఇప్పటికైనా దేవస్థానం అధికారులు స్పందించి నంది సర్కిల్ సమీపంలోనే మరుగుదొడ్లు, స్నానాల గదులు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.



పాతాళగంగ రహదారిలో దుకాణాల మధ్య ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు

ధ్యాన కేంద్రాన్ని కూల్చాలనడం సరికాదు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల మున్సిపల్ పార్కులోని పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని కూల్చాలని అధికారులు చెప్పడం సరికాదని మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పార్కులోని ఆయుష్ యోగా, పిరమిడ్ కేంద్రాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. పిరమిడ్ కేంద్రాన్ని తొలగిస్తామని మున్సిపల్ అధికారులు చెబుతున్నారన్నారు. మున్సిపల్ స్థలాలను కబ్జా చేసిన వారిని వదిలేసి ప్రజలకు ఉపయోగపడే కేంద్రాన్ని కూల్చాలనడం పద్ధతికాదన్నారు. అభివృద్ధి చేయాలనుకుంటే పిరమిడ్ కేంద్రాన్ని మున్సిపాల్టీనే నిర్వహించాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కొత్తపల్లి, న్యూస్‌టుడే : నాలుగు రోజుల కిందట ఇంటి ముందు జారిపడి గాయాలపాలైన కొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన గూడెం స్వాములు (22) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై కేశవ ఆదివారం తెలిపారు. గాయపడిన యువకుడిని కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

చెట్టు కూలి రాకపోకలకు ఇబ్బందులు

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే : సున్నిపెంటలోని ఫిల్టర్‌హౌస్ దగ్గర ఆదివారం రహ



విరిగిపడిన చెట్టు

దారికి అడ్డంగా చెట్టు పడటంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. శ్రీశైలం భ్రమరాంబ, మల్లికార్జునస్వామి దర్శనం కోసం ఈ రహదారి నుంచే తెలంగాణ ఆర్టీసీ బస్సులు, భక్తులు తమ వాహనాల్లో పెద్ద సంఖ్యలో వస్తుంటారు. చెట్టు కొమ్మలు దారికి అడ్డంగా పడటంతో కాసేపు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దని వినతి

గడివేముల, న్యూస్‌టుడే : గడివేముల మండల పొదుపు లక్ష్మి సంఘం కార్యాలయం ఎదుట మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లమ్మ, లలిత కోరారు. ఈమేరకు ఆదివారం వారు గడివేముల ఏఎస్సై సలీంకు వినతిపత్రం అందించారు. మండల పొదుపు లక్ష్మి సంఘం కార్యాలయానికి నిత్యం మహిళలు వస్తుంటారని తెలిపారు. ప్రతినెలా వందలాది మందితో సమావేశాలు నిర్వహిస్తుంటామని పేర్కొన్నారు. కార్యాలయం ఎదుట మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే మహిళలకు ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం నంద్యాలకు వెళ్లి అబ్కారీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని బ్రాహ్మణకొట్కూరు సమీపంలో కేజీ రహదారిపై ఆదివారం ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్నాయి. ఆత్మకూడు డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు ఆత్మకూరు నుంచి 25 మంది ప్రయాణికులతో కర్నూలు వెళుతోంది. అదే సమయంలో నందికొట్కూరుకు వస్తున్న లారీ, బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ చింతకుంట ప్రదీప్‌కుమార్, కండక్టర్ సరస్వతి, ప్రయాణికుడు రామచంద్రుడుకు గాయాలయ్యాయి. స్థానికులు వారిని వెంటనే 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

(c) eenadu

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

అవీ.. ఇవీ.. అన్నీ..

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: బద్వేల్ ఘటనలో ఇంటర్ విద్యార్థినిని దారుణంగా హత్య చేసిన నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని ఆళ్లగడ్డ నూర్‌బాషా సంక్షేమ సంఘం అధ్యక్షుడు దూదేకుల దస్తగిరి డిమాండు చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు.

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: శివుడికి ప్రీతికరమైన కార్తిక మాసంలో వన భోజన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రెడ్డి సంఘం సీనియర్ నాయకుడు లక్కసాగరం లక్ష్మీరెడ్డి తెలిపారు. ఆదివారం ఓ ప్రైవేట్ పాఠశాలలో రెడ్ల సంఘం ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. నవంబరు 17న కార్తిక వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: కస్తూర్బా పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్లో ఖాళీగా ఉన్న వంట మనిషి (హెడ్‌కుక్), (అసిస్టెంట్ కుక్), వాచ్‌మేన్ పోస్టులకు అభ్యర్థులు ఒరిజనల్ ఆధార్ కార్డు, రెసిడెంట్ సర్టిఫికెట్స్, కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకొని హాజరు కావాలని ఎంఈవో సోమశేఖర్ ఆదివారం తెలిపారు. సోమవారం నంద్యాల డేనియల్‌పురంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాల ఉదయం 9 గంటలకు రావాలన్నారు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: కేజీబీవీ పాఠశాలలో నాన్‌టీచింగ్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు డేనియల్ పురంలోని జోసెఫ్ పాఠశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ పత్రాలతో హాజరవ్వాలని మండల విద్యాధికారి ఎ.ప్రభాకర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు.

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: సంఘ విద్రోహ శక్తుల ఆట కట్టించి, నేర రహిత డోన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నామని సీఐ ఇంతియాజ్ బాషా పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని కొండపేట, పాతపేటలో డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు.

మూడురాళ్లపల్లె(చాగలమర్రి), న్యూస్‌టుడే: మండలంలోని మూడురాళ్లపల్లె, కదిరిపురం, కేపీ.తండా గ్రామాల్లోని వ్యవసాయ బోర్ల నుంచి జలం ఉబికి వస్తోంది. విద్యుత్తు మోటారు వేయకున్నా జలం ఉబికి వస్తోంది. రెండు కార్లు పండించుకునేందుకు నీరు ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పథకాలు అమలు చేయాలి

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు డిమాండు చేశారు. ఆదివారం దొరపల్లెలో సీపీఐ గ్రామశాఖ సమావేశాన్ని కార్యదర్శి కొండయ్య అధ్యక్షతన నిర్వహించారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్యాపిలి, న్యూస్‌టుడే: పోతుదొడ్డి ఉపకేంద్రం పరిధిలో సోమవారం నుంచి బుధవారం వరకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ తెలిపారు. రాచవాండ్లపల్లె, మామిళ్లపల్లె, రాంపురంలో మూడు రోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు, జలదుర్గంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్తు ఉండదన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 80085 74916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

బేతంచెర్ల: సమస్య: రేపల్లెలో తాగునీటి ట్యాంకు చుట్టూ అపరిశుభ్రత నెలకొంది. నీటి ట్యాంకును శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయించాలి. –మద్దిలేటి, రేపల్లె

సమాధానం: ట్యాంకు శుభ్రం చేయించి సిబ్బందితో క్లోరినేషన్ చేయిస్తాం. –నాగప్రసాద్, పంచాయతీ కార్యదర్శి

సమస్య: వెంకటగిరిలో రహదారి వెంట గడ్డి పెరిగి అసౌకర్యంగా ఉంది. తొలగించి శుభ్రం చేయించాలి. –వెంకటేశ్వర్లు, వెంకటగిరి

సమాధానం: పరిసరాలను శుభ్రం చేయిస్తాం. –నాగ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి

నిర్లక్ష్యపు తుప్పు వదిలించేదెన్నడో ?

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: పురపాలక పరిధిలోనివాహనాలు తుప్పు పడుతున్నా బాగు చేయడం లేదు. పట్టణంలోని వార్డుల్లో పారిశుద్ధ్యం మెరుగుకు రూ.కోట్లు ఖర్చు చేసి తెప్పించిన వాహనాలు తుప్పుపడుతున్నాయి. డోన్ పురపాలిక పరిధిలో 32 వార్డులకు గాను 18,087 వరకు ఇళ్లుండగా, 75 వేలకు పైగా జనాభా నివసిస్తోంది. పట్టణంలోని చెత్తను కంపోస్టుయార్డుకు తరలించేందుకు ఆరు మినీ ఆటోలు, మూడు ట్రాక్టర్లు, రెండు కాంప్యాక్టర్లు మాత్రమే పనిచేస్తున్నాయి. మిగతా వాటికి మరమ్మతులు చేపట్టకపోవడంతో మూలకు చేరుతున్నాయి. పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ విభాగం అధికారులు చొరవ చూకపోవడంతో పాడైన వాహనాలకు మరమ్మతులు చేపట్టడం లేదు.

ఆటోలు, ట్రాక్టరు పరిస్థితి ఇలా..

☛ పట్టణంలోని 24 నుంచి 32వ వార్డుల్లోని చెత్తను తరలించే ట్రాక్టర్ పనిచేయకపోవడంతో రెండో సచివాలయం వెనుక ప్రహరీ దగ్గర వదిలేశారు. దాని ట్రాలీ కోట్ల వారి పల్లెలో షెడ్డుకు పంపించారే గానీ.. దాని జాడే కరవైంది.

☛ ఎనిమిది మినీ ఆటోలకు గాను రెండు తుప్పు పట్టాయి. ఉన్న ఆరు వాహనాలు కూడా సరైన కండీషన్‌లో లేకపోవడంతో చోదకులు అవస్థలపాలవుతున్నారు. మూడు ఆటోలకు వెనుక వైపు తలుపులు పాడయ్యాయి. లోపల, పక్కన తుప్పు పట్టి ఉండటంతో వాటికి రంధ్రాలు పడ్డాయి. టీచర్స్‌కాలనీ, సుందర్‌సింగ్ కాలనీ, వైఎస్ఆర్ నగర్ ప్రాంతాల వైపు చెత్తను తరలించే ట్రాక్టర్ కూడా పాడైంది. చెత్తవేస్తే కన్నాల నుంచి కిందకు పడిపోతోంది. చోదకులు, సిబ్బంది రంధ్రాల్లో ప్లాస్టిక్ సంచులు కూర్చి చెత్తను నిల్వ చేసుకుని కంపోస్టుకు తరలిస్తున్నారు. దీని వెనక తలుపు కూడా బాగోలేకపోవడంతో చెత్తంతా తిరిగి రోడ్డుపైనే పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య ఆటోలు, ట్రాక్టర్లకు ఆయిల్ మార్చక ఏళ్లు గడుస్తోంది. కనీసం గ్రీజు పట్టించే పరిస్థితి లేదు. కొన్నింటికి నంబరు బోర్డులు కూడా ఉండటం లేదు. టీచర్స్‌కాలనీ సైడ్ ట్రాక్టరు బాడీ, మినీ ఆటోల బాడీలు పాడయ్యాయి. వాటికి టైర్లు దెబ్బతింటున్నా కొత్తవి మార్చకపోవడం గమనార్హం.


పాడైన మినీ ఆటోలు

రోజూ రావడం లేదు
–కె.సునీత, కొండపేట, డోన్



మా వీధిలో ఇంటింటి చెత్త సేకరణకు మినీ ఆటో రోజూ రావడం లేదు. మూడు, నాలుగు రోజులకోసారి వస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇంటి వద్ద పోగయిన చెత్తను డబ్బాల్లో ఉంచి, ఆటో రాకపోవడంతో దూరంగా ఉన్న ఖాళీ ప్రాంతంలో పారబోస్తున్నాం.

మరమ్మతులకు చర్యలు
– సురేష్, మున్సిపల్ ఏఈ, డోన్

పారిశుద్ధ్య వాహనాలు పాడయ్యాయి. పారిశుద్ధ్య విభాగం ప్రతిపాదనలు పంపిస్తే మరమ్మతులకు కౌన్సిల్‌లో ఉంచుతాం. కౌన్సిల్ ఆమోదం పొందిన తర్వాత వాటి మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం.

ప్రవక్త జీవితం ఆదర్శప్రాయం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: మహమ్మద్ ప్రవక్త(సొ.అ.వ) జీవితం ఆదర్శప్రాయమని తెలుగు రాష్ట్రాల చెందిన 'హదియా మార్కెట్' సమన్వయకర్త మహ్మద్ హుస్సేన్ తెలిపారు. పట్టణంలో ఆదివారం అరుణోదయ పాఠశాలలో మహమ్మద్ ప్రవక్త(సొ.అ.వ) జీవితంపై విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ నిర్వహించారు. విజేతలకు తెదేపా కౌన్సిలర్ హుస్సేన్ బాషా, ఇస్లాం ధర్మ పండితులు బహుమతులు అందించారు. దొర్నిపాడు మండల సమన్వయకర్త హఫీజ్ ఉస్మాన్ బాషా, అమీర్ బాషా పాల్గొన్నారు.


విజేతకు బహుమతి అందిస్తున్న తెదేపా కౌన్సిలర్, తదితరులు

నిలిచిన నీరు ..రైతు కంట కన్నీరు



భారీ వర్షలకు పత్తి, మిరప, మొక్కజొన్న, జొన్న పాడయ్యాయి. పొలాల్లో వర్షపు నీరు నిలిచింది. గత కొన్ని రోజులుగా వర్షాలు పత్తి పంటలో పూత, పిందెలు, పత్తి కాయలు రాలుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల వ్యాప్తంగా దాదాపు 1000 హెక్టార్లకు పైగా సీడు పత్తి సాగు చేశారు. వర్షాల వల్ల క్రాసింగ్‌కు ఆటంకం కలగడం, పత్తి పిందెలు రాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. –న్యూస్‌టుడే, దొర్నిపాడు

మురుగు... శుభ్రత కనుమరుగు



చింతకొమ్మదిన్నెలోని బీసీ కాలనీలో వీధులన్నీ మురుగుతో నిండాయి. సక్రమమైన కాలువ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు రోడ్లపై నిల్వ ఉంటోంది. నివాసాల చెంతనే మురుగు ఉండటంతో రోగాలు ప్రబలుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, చింతకొమ్మదిన్నె(ఆళ్లగడ్డ గ్రామీణం)

సూచిక... బాగుచేయాలిక



మండల పరిధిలో పలుచోట్ల రహదారి సూచికలు, బోర్డులు పాడవ్వడంతో ప్రయాణికులు తికమకపడుతున్నారు. గత ప్రభుత్వం వాటిబాగుకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో పలువురు ప్రమాదాలపాలవుతున్నారు. సౌదరదిన్నె గ్రామం వద్ద మలుపు సూచిక దెబ్బతింది. దీన్ని సరిచేయాలని వాహన చోదకులు, గ్రామ ప్రజలు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, కోవెలకుంట్ల గ్రామీణం

రాకపోకలకు అవస్థలే!



ఆర్.జమ్మలదిన్నె నుంచి ఆళ్లగడ్డ జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో కల్వర్టు పాడైంది. సిమెంటు, కంకర లేచి గుంతలు పడటంతో వర్షపునీరు నిల్వ ఉంటోంది. రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. కల్వర్టు పాడవ్వడంతో తాత్కాలికంగా గ్రామస్థులు సీసీ పైపులు అమర్చారు. ఈ సమస్యను ఆదివారం పీఆర్ ఏఈ వెంకటయ్య దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా... 15వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చు చేసి మరమ్మతులు చేపడతామని చెప్పారు.
–న్యూస్‌టుడే, ఆర్.జమ్మలదిన్నె(ఉయ్యాలవాడ)

కూటమితోనే గ్రామాభివృద్ధి

పెండేకల్లు, ముద్దవరం(బేతంచెర్ల), న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని తెదేపా మాజీ సర్పంచి పెద్ద వెంకటేశ్వర్లు, రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ముద్దవరంలో రూ.10 లక్షలు, పెండేకల్లు, రేపల్లె, వెంకటగిరి గ్రామాల్లో రూ.30 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల అభివృద్ధి పనులకు ఎంపీడీవో ఫజల్ రహిమాన్, ఏఈ మహేష్ ఆధ్వర్యంలో భూమి పూజలు నిర్వహించారు. ఎల్లారెడ్డి, రాధాకృష్ణ, ఈరన్న, ఎల్లస్వామి, తిమ్మయ్య, రామాజంనేయులు తదితరులు పాల్గొన్నారు.


పూజ చేస్తున్న తెదేపా నాయకులు, సర్పంచి రామక్క

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బనగానపల్లి మండల పరిధిలోని బనగానపల్లి, యాగంటిపల్లి, తమ్మడపల్లి గ్రామాల్లో ఆదివారం పల్లెపండగ వారోత్సవాలు ఎంపీడీవో వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీ రహదారులకు భూమి పూజ జరిపారు. పంచాయతీరాజ్ ఏఈ వెంకటరమణ, బనగానపల్లి ఈవో సతీష్‌కుమార్‌రెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది అయా గ్రామాలకు చెందిన తెదేపా నాయకులు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.


భూమి పూజలో పాల్గొన్న అధికారులు, తెదేపా నాయకులు

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్లలో పల్లెపండగలో భాగంగా సాయినగర్, సీతారామనగర్, సుంకులమ్మగుడి బాబానగర్‌లో రూ.70లక్షలతో సీసీ రహదారులు, మురుగుకాల్వల నిర్మాణానికి భూమిపూజ ఆదివారం చేపట్టారు.

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని తెదేపా మండల అధ్యక్షుడు మూలె రామేశ్వరరెడ్డి చెప్పారు. పల్లె పండగలో భాగంగా ఆదివారం శాంతినగర్ కాలనీలో, ప్రభుత్వ వైద్యశాల సమీపంలో రూ.40లక్షలతో నిర్మించనున్న సిమెంటు రహదారులకు ఆయన భూమిపూజ చేశారు.


పాల్గొన్న అధికారులు, తెదేపా నాయకులు

మధ్యంతర భృతి ప్రకటించాలి

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేసి 30శాతం మధ్యంతర భృతిని ప్రభుత్వం తక్షణమే ప్రకటించాలని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి డిమాండు చేశారు. ప్యాపిలి మండలశాఖ అధ్యక్షుడు కృష్ణానాయక్ అధ్యక్షతన కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆ మండల స్వర్ణోత్సవ సభ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయనతో పాటు జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బి. మాణిక్యంశెట్టి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్యాపిలి మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలశాఖ గౌరవాధ్యక్షుడిగా శేషయ్య, అధ్యక్షుడిగా రమేష్, సహాధ్యక్షులుగా నాగమణి, ఖలీల్, ప్రధానకార్యదర్శిగా నరసింహారెడ్డి తదితరులను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న వెంకటసుబ్బారెడ్డి

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ముత్యాలపాడు(చాగలమర్రి), న్యూస్‌టుడే: ముత్యాలపాడు ఎస్పీజీ ఉన్నత పాఠశాలలో 1997-98వ బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కర్నూలు, వైఎస్సార్, అనంతపురం, చెన్నై, హైదరాబాదు, బెంగళూరు తదితర ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు 40 మంది దాదాపు 26సంవత్సరాల తర్వాత ఒకచోట కలిశారు. దివంగతులైన ఉపాధ్యాయులు, విద్యార్థులకు నివాళులర్పించారు.


గురువులతో పూర్వ విద్యార్థులు

యాగంటి ఆలయ ఛైర్మన్ బాధ్యతల స్వీకరణ

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయ ఈవోగా చంద్రుడు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కోవెలకుంట్ల గ్రూప్ టెంపుల్‌గా ఈవోగా పనిచేస్తున్న చంద్రుడికి అదనపు బాధ్యతలు అప్పగించారు.


నూతన ఈవోతో ఆలయ అర్చకులు, సిబ్బంది

సాహితీ లోకానికి వరం

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: సాహితీ లోకానికి డాక్టరు జానమద్ది హనుమచ్ఛాస్త్రి వరం లాంటి వారని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ పేర్కొన్నారు. జానమద్ది సాహితీ పీఠం ఆధ్వర్యంలో ఆదివారం కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి శతజయంతి వేడుకలు, గ్రంథాలయ, సాహిత్య సేవా పురస్కార ప్రదానోత్సవ జరిగింది. గండ్లూరి దత్తాత్రేయ శర్మలకు గ్రంథాలయ, సాహిత్య సేవా పురస్కారాలు ప్రదానం చేశారు.


దత్తాత్రేయశర్మను సత్కరిస్తున్న న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్

సమస్యల నిలయం.. అవస్థల మయం

★ రహదారుల పక్కనే అపరిశుభ్రత ★ ఎక్కడికక్కడ మురుగు గుంతలే

ప్యాపిలి, న్యూస్‌టుడే: ప్యాపిలి పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. సీసీ రహదారులు, కాలువలు, కల్వర్టులు, నీటి గొట్టాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో రహదారుల పక్కన, కాల్వల్లోని చెత్తా, చెదారం, వ్యర్థాలను కంపోస్టుయార్డులకు తరలించడం లేదు. ఎక్కడికక్కడ నిల్వలు పేరుకుపోతుండటంతో జనాలు రాకపోకలకు అవస్థలపాలవుతున్నారు. ఊర్లో పోగైన చెత్తను ప్రధాన రహదారుల పక్కన పారబోస్తున్నారు. ఆయా దారుల్లో నడుచుకుని వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నామని నివాసితులు వాపోతున్నారు. ఎప్పటికప్పుడు చెత్త తరలింపు సక్రమంగా జరగడం లేదని స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నారు.


పోతుదొడ్డిలో జాతీయ రహదారి పక్కనే వ్యర్థాలు

ఎక్కడెక్కడ ఎలా ఉందంటే...?

☛ పోతుదొడ్డి గ్రామ పంచాయతీలో 700లకు పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. ఊర్లోని చెత్తను తరలించేందుకు అవసరమైన స్థలాన్ని కేటాయించలేదు. ప్రభుత్వాలు, అధికారులు మారుతున్నా పెద్దగా మార్పేమీ ఉండటం లేదని నివాసితులు వాపోతున్నారు. ఊరిలో సేకరించిన చెత్తను ఎక్కడ వేయాలో తెలియక 44వ జాతీయ రహదారి పక్కనే పారబోస్తున్నారు. గుట్టలుగా ఇవి పోగవుతూ ఆ దారిలో వెళ్లే జనంతో పాటు బస్సుల్లో వెళ్లే ప్రయాణికులకు దుర్వాసనతో అవస్థలపాలవుతున్నారు.

☛ సిద్దనగట్టులో కూడా యార్డు లేకపోవడంతో ఊర్లోని చెత్తను పంచాయతీ సిబ్బంది ప్రధాన రహదారి పక్కన పారబోస్తున్నారు. ఆ గ్రామంలో రోడ్డుపైనే మురుగు నిల్వ ఉండి ఇటు చెత్త కంపు..అటు మురుగునీటితో ప్రజలు అవస్థలపావుతున్నారు. దోమలు చేరి వ్యాధులకు గురవుతున్నా అధికారుల్లో చలనం లేకపోతోంది.

☛ వెంగళాంపల్లెలోని ఎస్సీ కాలనీలో గత ప్రభుత్వంలో సీసీ రోడ్డు సగం వరకు నిర్మాణం చేపట్టి వదిలేశారు. మిగతాది పూర్తి చేయకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

☛ వెంగళాంపల్లెలోని ఎస్సీ కాలనీవాసులకు గతంలో కమ్యూనిటీహాల్ కోసం స్థలాన్ని కేటాయించారు. 20 ఏళ్లకు పైగా అవుతున్నా...నేటికీ దాని నిర్మాణం చేపడదామన్న ఆలోచన పాలకులకు గానీ, అధికారులకు గానీ లేకపోవడం బాధాకరమంటున్నారు. శ్మశానవాటిక చుట్టూ ప్రహరీ, నీటి సౌకర్యం లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు.

☛ బావిపల్లెలో ప్రధాన రహదారి గోతులతో నిండిపోయింది. సీసీ రోడ్డు నిర్మాణాన్ని అధికారులు విస్మరించారని స్థానికులు వాపోతున్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మించాలి
–మధు, వెంగళాంపల్లి



ఎస్సీ కాలనీవాసులకు కమ్యూనిటీ హాల్‌ను మంజూరు చేశారు. స్థలాన్ని కేటాయించారు. 20 ఏళ్లకు పైగా అవుతున్నా... నేటికీ నిర్మాణం చేపట్టకపోవడం దారుణం. పాలకులకు, అధికారులకు తెలియజేస్తున్నా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి నిధులు మంజూరు చేయించి కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలి.

సమస్యల పరిష్కారానికి కృషి
–బాలకృష్ణ, ఈవోఆర్డీ, ప్యాపిలి

గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేస్తాం. రహదారుల పక్కన వేసిన వ్యర్థాలను సిబ్బందితో తొలగించి పరిశుభ్రం చేయిస్తాం. వర్షాల కారణంగా కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగు రోడ్లపై పారుతోంది. సిబ్బందితో కాల్వల్లోని వ్యర్థాలను తొలగించేలా చేస్తాం. వెంగళాంపల్లె గ్రామంలో ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్ స్థలాన్ని పరిశీలించి నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించేందుకు కృషి చేస్తాం.

అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్తహంగులు

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఇటీవల కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలను 'సక్షం' (స్టిమ్యులేటింగ్ అడ్వాన్స్‌డ్ నాలెడ్జ్ ఫర్ సస్టెయినబుల్ హెల్త్ మేనేజ్) కేంద్రాలుగా ఎంపిక చేసింది. ఇందులో భాగంగా బనగానపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో 23 కేంద్రాలను ఎంపిక చేశారు.

▸▸ బనగానపల్లి మండలంలో మూడు కేంద్రాలను ఎంపిక చేశారు. వాటిలో ఇల్లూరుకొత్తపేట-1, భానుముక్కల-4, నందవరం-2 కేంద్రాలు ఉన్నాయి. .

▸▸ అవుకు మండలంలో తొమ్మిది కేంద్రాలు ఎంపిక చేశారు. వాటి పరిధిలో రామాపురం-2, నిచ్చెనమెట్ల, చెర్లోపల్లి-1, గుండ్లశింగవరం-1, 2 కేంద్రాలు, గడ్డమేకలపల్లి, మెట్టుపల్లి-1, సంగపట్నం-2, చనుగొండ్ల కేంద్రాలున్నాయి.

▸▸ కోవెలకుంట్ల మండలంలో నాలుగు కేంద్రాలను ఎంపిక చేశారు. వాటిలో కోవెలకుంట్ల-2, అమడాల-2, గుళ్లదుర్తి-2, కంపమళ్ల-2 కేంద్రాలను ఎంపిక చేశారు.

▸▸ కొలిమిగుండ్ల మండలంలో ఏడు కేంద్రాలను ఎంపిక చేశారు. కొలిమిగుండ్ల-3, బెలుం-3, చింతలాయిపల్లె-2, ఎస్.చెన్నంపల్లి, పెద్దవెంతుర్ల, పెట్నికోట-1, మదనంతపురం కేంద్రాలున్నాయి.

పూర్తి వివరాలు ఇలా

మండలం	ఎంపికైన కేంద్రాలు
బనగానపల్లి	03
అవుకు	09
కోవెలకుంట్ల	04
కొలిమిగుండ్ల	07

▸▸ సక్షం పథకానికి ఎంపికైన కేంద్రాల్లో పలు సదుపాయాలు కల్పించాల్సి ఉంటోంది. కేంద్రంలోని వసతులను బట్టి సదుపాయాలు కల్పిస్తారు. కేంద్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం, నీటి వసతులు కల్పించడంతో పాటు న్యూట్రీగార్డెన్‌ను ఏర్పాటు చేస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో వాన నీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు తవ్వించడం లాంటివి చేసేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది.

▸▸ న్యూట్రీగార్డెన్‌కు రూ.10 వేలను అంగన్‌వాడీ కార్యకర్తకు చెందిన ఖాతాలో జమచేస్తారు. దీంతో కేంద్రం ఆవరణలోని గార్డెన్‌లో పండ్లు, కూరగాయలు, ఆకుకూరల్ని పెంచాలి. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడానికి న్యూట్రిగార్డెన్స్‌తో ప్రయోజనం కలుగుతుంది.


నందవరంలో మొక్కలు నాటుతున్న సిబ్బంది

☛ సక్షం కింద సదుపాయాల కల్పన

▸▸ వాననీటిని ఒడిసి పట్టేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల ఏర్పాటుకు రూ.16 వేలు కేటాయించారు..

▸▸ అంగన్‌వాడీ కేంద్రంలో వసతులకు రూ.19,800 కేటాయించారు. జిల్లాస్థాయిలో అధికారులు ఆ నిధులతో కేంద్రాలకు ప్రతిపాదించిన సౌకర్యాలు కల్పిస్తారు.

కేంద్రాలకు ప్రయోజనం
-ఉమామహేశ్వరమ్మ, సీడీపీవో, బనగానపల్లి ప్రాజెక్ట్

సక్షం పథకానికి ఎంపికైన కేంద్రాలకు పలు సదుపాయాలు కల్పిస్తున్నాం. న్యూట్రిగార్డెన్, వాననీటి సంరక్షణకు ఇంకుడు గుంతను ఏర్పాటు చేస్తారు. గార్డెన్‌తో చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు తాజా కూరగాయలతో పౌష్టికాహారం అందించనున్నాం. తోటలకు సంబంధించిన పనులు వేగవంతం చేయిస్తాం.

పల్లె కబుర్లు

కోవెలకుంట్ల గ్రామీణం: వల్లంపాడు: కోవెలకుంట్ల మండలం వల్లంపాడు గ్రామం, కుందూ మధ్యనున్న కప్పలవాగుకు వరద ఉద్ధృతి తగ్గుముఖం పట్టడంతో లింగాలకు రాకపోకలు సాగుతున్నాయి.

వల్లంపాడు: వల్లంపాడు నుంచి అప్పలపురానికి వెళ్లేందుకు ఇరు గ్రామాల మధ్య తారురోడ్డు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్యాపిలి, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు ఘర్షణలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్సై మధుసూదన్ పేర్కొన్నారు. ఆదివారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు మంత్రణం నిర్వహించారు.

సంజామల: నొస్సంలో ఆదివారం రాత్రి యువతి అదృశ్యమవ్వడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 19న కళాశాలకు రుసుము చెల్లిస్తానని చెప్పి వెళ్లి రాలేదని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

వైకుంఠ సమారాధన



మా అందరికీ ఆత్మీయత, అనురాగాలను పంచి, మా అభివృద్ధికి అహర్నిశలు శ్రమించి మాకు ఆదర్శమూర్తిగా నిలిచిన మీరు మా నుండి భౌతికంగా దూరమవడం మాకు తీరనిలోటు... మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవున్ని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ శ్రీ వనముగాళ్ల వెంకట క్రిష్ణయ్య గారు
B.A., B.Ed., S.A., (Social Studies)
జననం : 01-07-1969 మరణం: 11-10-2024

భార్య: వనముగాళ్ల జయలక్ష్మి
అమ్మ: వి.రామలక్ష్మమ్మ,
నాన్న: కీ॥శే॥ వి.వనుమన్న

కుమారులు - కోడళ్లు
వి.ముఖేష్ - స్వర్ణరేఖ
PGT English, AP Model School, OWK
వి.నాగార్జున - దుర్గ

మనవళ్లు: వి.వైదిక్, వి.త్రిశుల్
అన్న: వి.నాగశేషుడు,
తమ్ముడు: వి.లక్ష్మి నారాయణ

గమనిక: 21-10-2024 సోమవారం ఉదయం మా స్వగృహం H.No.8/12, మార్కెట్ స్ట్రీట్, అవుకు నందు జరుగును. Cell: 98855 50298, 99491 42916.

(c) eenadu